ప్రభుత్వ స్థలాల ఆక్రమణలు సహించం

- రెవెన్యూ అధికారులే బాధ్యత వహించాలి
- కబ్జాదారులు ఎమ్మెల్యేలైనా, ఎంతటి వారైనా ఉపేక్షించొద్దు
- వచ్చేనెలలో తెల్లరేషన్ కార్డులు, ఇందిరమ్మ గృహాలు : మంత్రి పొంగులేటి
- ఇల్లెందు నియోజకవర్గ స్థాయి అధికారులతో సమీక్ష
- రూ.23కోట్ల విలువైన పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు

7



సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి

వరికి తెగులు.. రైతుకు దిగులు

- నాట్లు అయిన నెలకే ఆశిస్తున్న బ్యాక్టీరియా, వైరస్ రకాలు
- రక్షణ కోసం మందులు పిచికారి చేస్తున్న అన్నదాతలు
- దిగుబడులు తగ్గుతాయేమోనని తీవ్ర ఆందోళన
- జాగ్రత్తలు తీసుకోవాలంటున్న వ్యవసాయాధికారులు

7



తెగులు సోకిన పొలం



ప్రపంచ చెస్‌లో హారిక ప్రతిభ

- చెస్ ఒలింపియాడ్‌లో బంగారు పతకం కైవసం
- మహిళల జట్టులో సభ్యురాలిగా తనదైన ముద్ర
- హారిక ఖమ్మం కోడలు కావడంతో హర్షాతిరేకాలు
- ఆనందం వ్యక్తం చేసిన కుటుంబ సభ్యులు

7

పాలేరు దిగువన సాగర్ కాలువకు శనివారం పడిన బుంగను పూడ్చివేసేందుకు చేపట్టిన మరమ్మతుల్లో మార్పు చోటు చేసుకుంది. కాలువ కింద అండర్ టన్నెల్ కట్టడం లేకుండానే కాల్వ కరకట్టకు అధికారులు మరమ్మతులు చేపట్టారు. ఆదివారం కూలిపోయిన యూటీని పూర్తిగా తొలగించిన అధికారులు.. వాటిస్థానంలో తాత్కాలికంగా సిమెంట్ పైపులు వేయాలని నిర్ణయించారు. ఈ మేరకు 30పైపులు అవసరం అవుతాయని లెక్కించారు. పైపులను సైతం సైట్‌లోకి తెప్పించారు. కానీ పైపుల ఏర్పాటుతో పనులు మరో రెండు రోజులు అలస్యం అవుతాయని గుర్తించారు. ఇప్పటికే సాగర్ ఆయకట్టు పొలాలు 22రోజులుగా నీరందక ఎండి పోతుండటం, ఈ సమస్యపై రైతులు, విపక్షాలు, రైతు సంఘాలనుంచి తీవ్ర నిరసన వ్యక్తం అవుతుండటంతో అధికారులు పైపుల ఏర్పాటు ప్రయత్నాలను ఉపసంహరించుకున్నారు.



అండర్ టన్నెల్ వద్ద కొనసాగుతున్న సాగర్ కాలువ పునరుద్ధరణ పనులు

అండర్ టన్నెల్‌కు ప్రత్యామ్నాయంగా తెప్పించిన పైపులు

అండర్ టన్నెల్‌కు చెక్

సాగర్ కాలువ పునరుద్ధరణ పనుల్లో మార్పు

- టన్నెల్ స్థానంలో పైపుల ఏర్పాటుకు బ్రేక్... పనులు ఆలస్యం అవుతుండడమే కారణం.. వరద ప్రవాహానికి ప్రత్యామ్నాయ చర్యలు
- సీఈ ఆదేశాలతో నిర్ణయం మార్చుకున్న అధికారులు
- వడివడిగా సాగుతున్న బండింగ్ పనులు
- పాలేరు నుంచి నీటి విడుదలకు సన్నాహాలు

కూసుమంచి, సెప్టెంబరు 23: ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఇరిగేషన్ అధికారులు యూటీ నిర్మాణం లేకుండానే ఎడమకాల్వ కరకట్ట నిర్మాణానికి పనులు వేగిరం చేశారు. పైపుల ఏర్పాటు కోసం తీసిన గుంతను పూడ్చివేశారు. పనుల్లో భాగంగా కట్టకు రెండువైపులా బండింగ్ చేస్తున్నారు. బండింగ్ అనంతరం గండిపడిన రెండువైపులా టార్పల్‌తో కప్పివేయనున్నారు. అదేవిధంగా మట్టి బస్తాలతో కట్ట తిరిగి కోతకు గురికాకుండా ఏర్పాట్లు చేస్తున్నారు ఎట్టిపరిస్థితుల్లోనూ రైతులు నష్ట పోకుండా పంటలు కాపాడాలని రాష్ట్ర మంత్రులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి, తుమ్మల నాగేశ్వరరావు, ఇంజనీరింగ్ అధికారులు కృషి చేస్తున్నారు.

వరదనీటి తరలింపునకు ప్రత్యామ్నాయ చర్యలు

కాగా యూటీ నిర్మాణం పూర్తిగా నిలిపివేసినందున వరదనీటి తరలింపునకు అధికారులు ప్రత్యామ్నాయ చర్యలు చేపట్టనున్నారు. సాగర్ ఎడమకాల్వ అవతల జుజ్జులరావుపేట, పాలేరు, తదితర గ్రామాల్లో ఆయకట్టు పొలాల నుంచి వరదనీరు యూటీ ద్వారా ఏట్లో కలుస్తుంది. కానీ సాగర్ ఆయకట్టు చివరి భూములకు నీరందించే ఉద్దేశ్యంతో ప్రస్తుతం యూటీ నిర్మాణానికి బ్రేక్ ఇచ్చారు. అయితే వరదనీటి తరలింపునకు జనరేటర్ల ద్వారా కాల్వలోకి ఎత్తిపోయడం కానీ లేదా కాల్వ పక్కనే ఛానల్ నిర్మాణం ద్వారా నీటిని తరలించి ఎక్కడో ఒకచోట తరలించే విధంగా ఏర్పాట్లు చేస్తున్నారు. మంగళవారం నీరు విడుదల చేసేవిధంగా యుద్ధప్రాతిపదికన ఏర్పాట్లు చేస్తున్నారు.

పంటలు ఎండిపోయాక నీళ్లిస్తారా..?

ఇరిగేషన్ అధికారులపై మంత్రి తుమ్మల సీరియస్

'రైతులతో నాటకాలు ఆడుతున్నారా..? పంటలన్నీ ఎండిపోయాక నీళ్లిస్తారా..? 20 రోజులనుంచి ఏం చేస్తున్నారు..? నాలుగు నియోజకవర్గాల్లో రెండు లక్షల ఎకరాల్లో పంటలు ఎండిపోతున్నాయి...' అంటూ నీటిపారుదలశాఖ అధికారులపై వ్యవసాయశాఖమంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు కూసుమంచి మండలం మల్లాయిగూడెం వద్ద సాగర్ ఎడమకాల్వ పునరుద్ధరణ పనులను కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్‌తో (మిగతా 7వ పేజీలో)




సాగర్‌కాలువ పునరుద్ధరణ పనులను పరిశీలిస్తున్న మంత్రి తుమ్మల నాగేశ్వరరావు



పనులను పరిశీలిస్తున్న మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి



పన్నుదన్ను ఏదీ!?



'అసెస్‌మెంట్'పై దాగుడుమూతలు

- పీటీఐ నెంబర్ లేకుండానే డోర్ నెంబర్ కేటాయింపు
- 2021లో ప్రారంభమైన బస్టాండ్‌కు 2024లో నోటీసు
- ఎవరిపేరు మీద ట్యాక్స్ వేయాలో తెలియక అంతకాలం ఆగారట
- ఐటీ హబ్, వెజ్ అండ్ నాన్‌వెజ్ మార్కెట్లదీ అదే పరిస్థితి
- చేసిన తప్పులను కప్పిపుచ్చుకునే ప్రయత్నాల్లో అధికారులు
- చర్చనీయాంశంగా మారిన 'ఆంధ్రజ్యోతి' కథనం

ఖమ్మం, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): 'ఖమ్మం నగరంలోని నూతన ఆర్టీసీ బస్టాండ్‌కు పన్ను వేశాం. పన్ను చెల్లించాలని నోటీసులు కూడా పంపించాం..' అని ఖమ్మం నగరపాలక సంస్థ అధికారులు సెలవిస్తున్నారు. సర్కారు ఆస్తులకు పన్ను మదింపు చేయడం లేదని 'ఇవి ఆస్తులు కావా..?' అనే శీర్షికతో 'ఆంధ్రజ్యోతి' జిల్లా అనుబంధంలో సోమవారం ప్రత్యేక కథనం ప్రచురితమైన విషయం విధితమే. ఈ కథనం నగర పాలక సంస్థ వర్గాల్లో కలకలం రేపింది. దీనిపై భుజాలు తడుముకున్న అధికారులు తాము పన్ను నోటీసులు పంపించామని వివరణ ఇచ్చారు.

వాస్తవానికి మునిసిపల్ కార్పొరేషన్ అధికారులు ఆర్టీసీ బస్టాండ్‌కు డోర్ నెంబర్ కేటాయించి, ఆ నెంబరు పేరుతో గత మే నెలలో నోటీసులు పంపారు. అందులో 2022 నుంచి 2024 వరకు రూ.9.83 లక్షలు పన్ను చెల్లించాలని పేర్కొన్నారు. అయితే అధికారులు జారీ చేసిన ఈ నోటీసు బోలెడన్ని ప్రశ్నల్ని లేవనెత్తుతోంది. అసలు అసెస్‌మెంట్ (ప్రాపర్టీ ట్యాక్స్ ఐడెంటిఫికేషన్) నెంబరు లేకుండా డోర్ నెంబర్ ఎలా కేటాయించారనేది ప్రశ్నార్థకం. పన్నుల వ్యవహారాల్లో అవకతవకలు జరగకూడదన్న ఉద్దేశంతో ఇంటినెంబరు కేటాయింపులు, పన్నుల మదింపు సులభతరం చేసిన మునిసిపల్‌శాఖ ఆ ప్రక్రియ మొత్తాన్ని ఆన్‌లైన్ చేసింది. దాని ప్రకారం ఎవరికైనా ఇంటి నెంబరు కేటాయించాలన్నా, పన్ను లెక్కించాలన్నా ముందుగా ఆన్‌లైన్‌లోనే వివరాలు అందించి సెల్ఫ్ అసెస్‌మెంట్ చేయాల్సి ఉంటుంది. అందులో భాగంగా నిర్మాణం ఎంత విస్తీర్ణంలో చేపట్టారు, ఎలాంటి నిర్మాణం వంటి అన్ని అంశాలను నమోదు చేసిన అనంతరం ఆయా వివరాల ఆధారంగా పన్ను లెక్కింపు జరుగుతోంది.

అది చెల్లించిన తర్వాత మునిసిపల్ అధికారులు ఆయా నిర్మాణాన్ని పరిశీలించిన తర్వాత దానికి అసెస్‌మెంట్ నెంబరు కేటాయించి డోర్ నెంబరు ఇస్తారు. అలా జరగని పక్షంలో ప్రభుత్వ కార్యాలయాలు వంటి వాటికి నేరుగా కార్పొరేషన్ అధికారులే అసెస్‌మెంట్ వేయాల్సి ఉంటుంది. అది కూడా ఆన్‌లైన్‌లోనే జరగాల్సి ఉంటుంది. ఆ సందర్భంలో కచ్చితంగా అసెస్‌మెంట్ నెంబరు కేటాయింపు జరుగుతుంది. కానీ ప్రస్తుతం నూతన బస్టాండ్‌కు పన్ను విధించిన అంశంలో అసెస్‌మెంట్ నెంబరు లేకుండానే డోర్ నెంబరు కేటాయించి (మిగతా 7వ పేజీలో)

ప్రజావాణిలో వినతుల వెల్లువ

- దరఖాస్తులు స్వీకరించిన కలెక్టర్, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్



వరద బాధితుల కోసం ప్రజావాణిలో అదనపు కలెక్టర్ శ్రీజకు విరాళం అందజేస్తున్న ఖమ్మానికి చెందిన మోహన్‌రావు, బ్రహ్మద దంపతులు

ఖమ్మం కలెక్టరేట్, సెప్టెంబరు 23: ప్రజా సమస్యలు పెండింగ్‌లో ఉంచకుండా తక్షణమే పరిష్కరించాలని కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ అధికారులను ఆదేశించారు. సోమవారం ఖమ్మం కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ పి.శ్రీజ, జిల్లా రెవెన్యూ అధికారి ఎం.రాజేశ్వరి తదితరులు ప్రజల నుంచి దరఖాస్తులను స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజల సమస్యలను తక్షణమే పరిష్కరించాలన్నారు. ఈ సందర్భంగా ఇటీవల వరదల్లో ముంపునకు గురైన బాధితులు తమ గోడును కలెక్టర్‌కు విన్నవించారు. కార్యక్రమంలో కలెక్టరేట్ పరిపాలన అధికారి అరుణ, (మిగతా 6వ పేజీలో)

అన్నార్థుల కోసం 'అన్న' క్యాంటీన్

ఖమ్మం మామిళ్లగూడెం, సెప్టెంబరు 23: ఖమ్మం నగరంలో 'అన్న క్యాంటీన్' ను తెలుగు తమ్ముళ్లు అందుబాటులోకి తీసుకొచ్చారు. ఎన్టీఆర్ అభిమానుల ఆధ్వర్యంలో ఖమ్మం కాల్వొడ్డులో సోమవారం 'అన్న క్యాంటీన్'ని బిలీఫ్ హాస్పిటల్ అధినేత మోడెంపూడి రమాజ్యోతి ప్రారంభించారు. ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ ప్రతి రోజు 150 నుంచి 200మందికి అన్నం పెట్టాలనే ఆలోచనతో ఈ క్యాంటీన్‌ను ప్రారంభించినట్లు తెలిపారు. పుట్టినరోజు, పెళ్లిరోజుల సందర్భంగా, కుటుంబ సభ్యుల పేరుతో, ఎన్టీఆర్‌పై అభిమానంతో ఎవరైనా అన్నదానం చేయాలి అని అనుకుంటే 'అన్న క్యాంటీన్'ని సంప్రదించాలని నిర్వాహకులు కోరారు. కేవలం రూ.5 లకే పప్పు, చట్నీ, సాంబారు, పెరుగుతో ఇక్కడ భోజనం అందించనున్నారు. మధ్యాహ్నం 12.30గంటల నుంచి 2గంటల వరకు 'అన్న క్యాంటీన్'లో భోజనం అందుబాటులో ఉంటుంది. ఈ కార్యక్రమంలో తాళ్లూరి శ్రీనివాస్‌చౌదరి, ఆంజనేయులు గౌడ్, కైలేశ్వరరావు, కిరణ్, బి.కనకయ్య, బెల్లంకొండ శీను, నీరజ్, నవీన్ తదితరులు పాల్గొన్నారు.



ఖమ్మంలోని కాల్వొడ్డులో ఏర్పాటు చేసిన అన్న క్యాంటీన్

భద్రాద్రి ప్రసాదాలకు పరీక్ష

- నాణ్యత పరిశీలన కోసం ముడిసరుకు నమూనాల సేకరణ
- ఇప్పటికే నివేదిక ఇవ్వాలని లేఖ రాసిన దేవస్థానం

భద్రాచలం, సెప్టెంబరు 23: భద్రాచలంలోని శ్రీసీతారామచంద్రస్వామి వారి ఆలయంలో సోమవారం లడ్డూ, చెక్కర పొంగలి ఇతర ప్రసాదాలకు వినియోగించే నెయ్యితోపాటు ఇతర ముడిసరుకుల నమూనాలను ఆహార భద్రత అధికారి (ఫుడ్ సేఫ్టీ ఆఫీసర్) కిరణ్ సేకరించారు. భద్రాచలంలోని శ్రీసీతారామచంద్రస్వామి వారి ఆలయంలో ప్రసాదాలకు వినియోగించే ముడి సరుకుల నాణ్యతను పరిశీలించాలని ఇప్పటికే దేవస్థానం ఈవో ఎల్.రమాదేవి లేఖ ద్వారా ఆహార భద్రత అధికారులను కోరారు. తిరుమల లడ్డూ ప్రసాదం నాణ్యతపై ఆరోపణలు తలెత్తుతున్న నేపథ్యంలో భద్రాద్రిలో ప్రసాదాల తయారీ కోసం వినియోగిస్తున్న నెయ్యితోపాటు ఇతర ముడి సరుకుల నాణ్యతను తెలుసుకోవాలని దేవస్థానం అధికారులు భావించారు.

ఈ క్రమంలో ఇప్పటికే లేఖను రాయగా సోమవారం సంబంధిత అధికారి ఆలయానికి వచ్చి ముడిసరుకు నమూనాలను సేకరించారు. వీటిని ల్యాబ్‌లో పరీక్షల నిమిత్తం తీసుకెళ్తున్నట్లు పేర్కొన్నారు. పరీక్షల అనంతరం సంబంధిత నివేదికను దేవస్థానం అధికారులకు అందజేయనున్నారు. వాస్తవానికి ఆహార భద్రత అధికారులు ప్రతి ఏటా శ్రీరామనవమి, ముక్కోటి సమయాల్లో మాత్రమే తనిఖీలు నిర్వహించి నమూనాలను సేకరించి పరీక్షల అనంతరం నివేదికను జిల్లా కలెక్టరుకు అందజేస్తున్నారు.

అయితే తిరుమల ఘటన తెరపైకి వచ్చిన క్రమంలో భద్రాద్రి దేవస్థానమే స్వయంగా ముడిసరుకుల నాణ్యతకు సంబంధించి ప్రతిసారి ముడి సరుకులకు సంబంధించి కొత్త లోడు వచ్చిన వెంటనే నమూనాలను సేకరించి పరీక్షలు నిర్వహించాలని అధికారికంగా లేఖ రాశారు. ఈ క్రమంలో అధికారులు నమూనాలను సేకరించడంతో నివేదిక ఎలా వస్తుంది అనేది ఆసక్తి నెలకొంది.



సేకరించిన నమూనాలు



ఏపీ సీఎం సహాయనిధికి రూ.25లక్షల విరాళం

చంద్రబాబుకు అందించిన తాళ్లూరి పంచాక్షరయ్య ట్రస్టు చైర్మన్

ఖమ్మం, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతిప్రతినిధి): ఆంధ్రప్రదేశ్‌లో ఇటీవల వచ్చిన వరదలను దృష్టిలో ఉంచుకుని తాళ్లూరి పంచాక్షరయ్య చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో రూ.25లక్షల విరాళాన్ని ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడిని కలిసి ట్రస్టు చైర్మన్ తాళ్లూరి పంచాక్షరయ్య తదితరులు సోమవారం అందించారు. అమెరికాలోని తన కుమారులు డాక్టర్ తాళ్లూరి రాజాశ్రీకృష్ణ, తానా మాజీ అధ్యక్షుడు తాళ్లూరి జయశేఖర్‌ల సౌజన్యంతో ఈ సహాయం అందించినట్టు ట్రస్టుచైర్మన్ తాళ్లూరి పంచాక్షరయ్య ఓ ప్రకటనలో తెలిపారు. ఇటీవల ఏపీలో వరదలతో తీవ్రనష్టం జరిగిందని, తమ ట్రస్టు తరుపున సహకారం అందించామని తెలిపారు. చంద్రబాబును కలిసిన వారిలో ట్రస్టు చైర్మన్ పంచాక్షరయ్యతోపాటు డైరెక్టర్ వల్లూరిపల్లి వంశీకృష్ణ, బూర్గంపాడు సొసైటీ అధ్యక్షుడు బిక్కసాని శ్రీనివాసరావు, తూము రామిరెడ్డి తదితరులున్నారు.

2 నుంచి రేషన్‌కార్డులకు దరఖాస్తుల స్వీకరణ

- రూ.100కోట్లతో రఘునాథపాలెం మండలానికి సాగునీరు
- ఇందిరమ్మ ప్రభుత్వంతోనే ఇంటింటా సంక్షేమ ఫలాలు
- రాంక్యాతండా సభలో మంత్రి తుమ్మల నాగేశ్వరరావు



కాంగ్రెస్‌లోకి ఆహ్వానిస్తున్న మంత్రి తుమ్మల

రఘునాథపాలెం, సెప్టెంబరు 23: నిరుపేదలు ఎన్నో ఏళ్లుగా ఎదురు చూస్తున్న రేషన్‌కార్డుల కోరిక త్వరలోనే రాష్ట్ర ప్రభుత్వం నెరవేర్చనుందని, అక్టోబరు 2 నుంచి నూతన రేషన్‌కార్డుల కోసం దరఖాస్తుల ప్రక్రియ ప్రారంభమవుతుందని, ఇందిరమ్మ ప్రభుత్వంలోనే ఇంటింటా సంక్షేమ పథకాలు, వీధివీధికి అభివృద్ధి కార్యక్రమాలు అమలు జరుగుతాయని, ఎన్నికల సమయంలో ఇచ్చిన ఆరు గ్యారెంటీలను అమలు చేసి చూపించామని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పేర్కొన్నారు. రఘునాథపాలెం మండలం రాంక్యాతండాలో సోమవారం నిర్వహించిన సభలో మంత్రి తుమ్మల ప్రసంగించారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రభుత్వ సంక్షేమ పథకాలను వివరించారు. వీ వెంకటాయపాలెం ఎన్ఎస్‌పీ కాల్వ నుంచి రూ.100 కోట్లు వ్యయం చేసి రఘునాథపాలెం మండలంలో ప్రతి గ్రామానికి సాగు నీటి కష్టాలను తీరుస్తామని హామీ ఇచ్చారు. రైతు రుణమాఫీకి ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. ప్రస్తుతం రూ.2 లక్షలలోపు ఉన్న రుణమాఫీలు అమలు జరిగాయని, బ్యాంకులో రూ.2లక్షలకు పైన రుణం ఉన్న రైతులకు త్వరలోనే మాఫీ చేస్తామన్నారు. ఈ సందర్భంగా స్థానిక అధికారులతో మంత్రి తుమ్మల మాట్లాడారు. రేషన్ కార్డుల దరఖాస్తుల ప్రక్రియకు సిద్ధంగా ఉండాలని తహసీల్దారు లూథర్‌విల్సన్‌కు సూచించారు. రైతు రుణమాఫీ అమలు కానీ వారి జాబితాలను తీసుకొని వారి కోసం సిఫార్సులు చేయాలని ఏవోను ఆదేశించారు. నూతన పింఛన్ల మంజూరు కోసం దరఖాస్తులు స్వీకరించాలని ఎంపీడీవో అశోక్‌కుమార్‌కు ఆదేశించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఇతర పార్టీలకు చెందిన నాయకులు మంత్రి తుమ్మల సమక్షంలో కాంగ్రెస్ కండువాలను కప్పుకున్నారు. కార్యక్రమంలో రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు, నాయకులు సాధు రమేశ్‌రెడ్డి, యర్రగర్ల హనుమంతరావు తదితరులు పాల్గొన్నారు.

ప్రజలకు మెరుగైన సేవలు అందించాలి

- జిల్లా ఆస్పత్రిని తనిఖీ చేసిన స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ శ్రీజ

ఖమ్మం కలెక్టరేట్, సెప్టెంబరు 23: ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ డా. పి. శ్రీజ అన్నారు. సోమవారం ఆమె జిల్లా జనరల్ ఆసుపత్రిని ఆకస్మికంగా తనిఖీ చేశారు. విధుల్లో ఉన్న సిబ్బంది హాజరు రిజిస్టర్‌ను పరిశీలించారు. విధులకు వైద్యులు, సిబ్బంది సకాలంలో హాజరు కావాలని, ప్రజలకు మెరుగైన వైద్య సేవలను అందించాలని సూచించారు. ఓ.పి., ఫార్మసీ, తల్లి పాల కేంద్రం, వార్డులు పరిశీలించారు. రోగులతో మాట్లాడి, అందిస్తున్న సేవల గురించి అడిగి తెలుసుకున్నారు.ఈ తనిఖీ సందర్భంగా ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ బి కిరణ్ కుమార్, ఆర్ఎంవోలు డాక్టర్ రాంబాబు, డాక్టర్ కళావతిభాయి,. డాక్టర్ వినాయక్ రాథోడ్ ఆస్పత్రి సిబ్బంది తదితరులున్నారు



వైద్యులతో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ శ్రీజ

లాభాలను పక్కదారి పట్టిస్తున్న యాజమాన్యం

- సమర్థిస్తున్న ఏఐటీయూసీ నాయకత్వం: సీఐటీయూ

కొత్తగూడెం, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): సింగరేణిలో 2023 - 24 సంవత్సరానికిగాను వచ్చిన నికరలాభం రూ.4701కోట్లు కాగా.. దానిని మసిబూసి మారేడుకాయ చేయటానికి రాష్ట్ర ప్రభుత్వం, సింగరేణి యాజమాన్యం కంపెనీ అవసరాల రీత్యా పెట్టుబడుల కోసమని రూ.2289 కోట్లు పక్కకు పెట్టి మిగతా వాటిపై మాత్రమే 33శాతం కార్మికులకు లాభాల వాటా ప్రకటించడం వారిని మోసం చేయడమేనని సింగరేణి కాలరీస్ ఎంప్లాయిస్ యూనియన్ సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మందా నర్సింహారావు పేర్కొన్నారు. సోమవారం కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. నికరలాభాన్ని స్థూలలాభంగా ఏఐటీయూసీ నాయకులు చెప్పడం వారి అవివేకానికి నిదర్శనమని పేర్కొన్నారు. గత అనేక సంవత్సరాలు నికర లాభంపై కార్మికులకు లాభాల వాటా ప్రకటిస్తామంటే ఈ సంవత్సరానికి ప్రతి కార్మికుడికి గత సంవత్సరం వచ్చిన లాభాల కంటే 2రెట్లు అదికంగా వచ్చేదని దానిని తగ్గించడానికి చేసిన కుట్రనే ఈ లాభాలను పక్కదారి పట్టించడం తప్ప మరోకటి కాదని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైన వాస్తవాలు తెలియచేసి కంపెనీపై ఒత్తిడి తీసుకొచ్చి 4701 నికర లాభంపై 33శాతం కార్మికులకు ఇప్పించాల్సిన బాధ్యత గెలిచిన సందర్భంగా ఉన్నదని ఆయన పేర్కొన్నారు.గత ప్రభుత్వం సింగరేణిని అన్ని విధాల ఆర్థికంగా నష్టం చేసిన విధానాలని ఇప్పటి ప్రభుత్వం కూడా అదేవిధంగా కొనసాగిస్తే కంపెనీ డబ్బులను ఇష్టారాజ్యంగా వాడుకుంటే దానికి సింగరేణి యాజమాన్యం ఒత్తాసు పలికితే సింగరేణి పరిస్థితి అగమ్యగోచరంగా మారుతుందని కార్మికులందరు మెలకువతో కంపెనీని కాపాడుకోవడానికి సమాయత్తం కావాల్సిన అవసరం ఉందని ఆయన పేర్కొన్నారు.

ముత్తంగి అలంకారంలో

భద్రాద్రి రామయ్య

భద్రాచలం, సెప్టెంబరు 23: భద్రాచల శ్రీసీతారామచంద్ర స్వామి వారు సోమవారం భక్తులకు ముత్తంగి అలంకారంలో దర్శనమిచ్చారు. ఈ సమయంలో అధికసంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు. అలాగే నిత్యకల్యాణ మండపంలో స్వామివారికి నిత్యకల్యాణం వైభవంగా జరిగింది. విశ్వక్సేన పూజ, పుణ్యాహవచనం, కంకణధారణ, జీలకర్రబెల్లం, మాంగల్యధారణ, వేద ఆశీర్వచనాన్ని వైదిక సిబ్బంది నిర్వహించారు.

25, 26,27 తేదీల్లో

'దోస్త్' స్పాట్ అడ్మిషన్లు

ఖమ్మం ఖానాపురంహవేలి, సెప్టెంబరు 23: డిగ్రీ కళాశాలలో మొదటి సంవత్సరం ప్రవేశాల కొరకు గత మూడు విడతల్లో సీట్లు పొందని విద్యార్థుల కొరకు విద్యాశాఖ ప్రత్యేకంగా ఈ నెల 25 నుంచి 27 తేదీల్లో కేవలం ప్రైవేటు డిగ్రీ కళాశాలలకు మాత్రమే స్పాట్ అడ్మిషన్లకు అవకాశం కల్పించారు. విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.

నేటి నుంచి ఎంపీసీ విద్యార్థులకు ఫార్మసీ కౌన్సెలింగ్ ప్రారంభం

ఖమ్మం ఖానాపురంహవేలి, సెప్టెంబరు 23: ఇంటర్మీడియట్‌లో ఎంపీసీ విద్యార్థులు ఎప్‌సెట్‌లో అర్హత సాధించి కౌన్సెలింగ్ కొరకు ఎదురుచూస్తున్న వారిని నేటి నుంచి ఫార్మసీ కౌన్సిలింగ్ ప్రారంభంకానున్నది. ఈ నెల 23 నుంచి 25 వరకు ఆప్షన్స్, 27న సీట్ల ఎలాట్‌మెంట్, 27, 28 తేదీల్లో ఆన్‌లైన్ పేమెంట్, ఆన్‌లైన్ సెల్ఫ్‌రిపోర్టింగ్, 28, 29 తేదీలలో కాలేజీల్లో రిపోర్టింగ్, 30న కళాశాల ప్రారంభం వివరాలు, విద్యార్థుల అడ్మిషన్ల వివరాలు విడుదలవుతాయి.

మెడికల్ ఇన్వాలిడేషన్ అయిన కార్మికుల వారసులకు

కారుణ్య నియామకపత్రాల అందజేత

కొత్తగూడెం, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): సింగరేణి కొత్తగూడెం ఏరియాలో పని చేస్తూ మెడికల్ ఇన్వాలిడేషన్ అయిన కార్మికుల పిల్లలకు సోమవారం కొత్తగూడెం ఏరియా జీఎం ఎం.షాలెం రాజు కారుణ్య నియామకపత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా జీఎం మాట్లాడుతూ సీఎండీ ఆదేశాల మేరకు 2018 నుంచి కారుణ్య నియామకాలు జరుగుతున్నాయని,ప్రస్తుతం ఈ నెలలో ముగ్గురికి కారుణ్య నియామక పత్రాలు అందజేయడం జరిగిందని, వారికి శుభాకాంక్షలు తెలిపారు. ఇచ్చిన ఈ అవకాశాలను శ్రద్ధగా క్రమశిక్షణతో నాకాలు లేకుండా పని చేసి సంస్థ అభివృద్ధికి పాటుపడాలని, రానున్న రోజుల్లో విద్యార్థులకు తగిన స్థాయిలో ఉద్యోగాలను పొందాలని ఆకాంక్షించారు. కారుణ్య నియామక ప్రక్రియ ప్రారంభమైన నాటినుంచి ఇప్పటివరకు కొత్తగూడెం ఏరియాలో 602 మందికి కారుణ్య నియామకపత్రాలు అందజేశామని, వారు కంపెనీలో బదిలీ వర్కర్ లాగ నియామకం అయి కంపెనీ నిర్వహించిన అంతర్గత పరీక్షల్లో అర్హత సాధించిన వారు ప్రమోషన్ పొంది వివిధ పోస్టుల్లో పని చేస్తున్నారన్నారు. ముఖ్యంగా డిపెండెంట్ ఉద్యోగాన్ని పొందిన వారసులు వారి తల్లిదండ్రులకు కృతజ్ఞతలై ఉండాలన్నారు. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ ఎస్‌వోటు జీఎం ఎం.రమేష్, డీజీఎం (పర్సనల్), బి.శివకేశవరావు, ప్రాజెక్టు ఆఫీసర్ కిష్టారం ఓసీ ఎంవీ.నర్సింహారావు, డీజీఎం (సర్వే) ఎస్.సదానందం, ఏరియా సేఫ్టీ ఆఫీసర్ ఎం.వెంకటేశ్వరరావు, డీవైపీఎం ఎం.శ్రావణ్‌కుమార్, యూనియన్ ప్రతినిధులు గౌస్, మధుకృష్ణ, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.



కారుణ్య నియామకపత్రాలను అందజేస్తున్న జీఎం షాలెంరాజు

దానవాయిగూడెం డంపింగ్‌యార్డు సమస్యపై

ఆందోళనకు సీపీఐ మద్దతు

ఖమ్మంటౌన్, సెప్టెంబరు 23: ప్రజల రోగాలకు కారణమవుతున్న దానవాయిగూడెం డంపింగ్‌యార్డు తరలించాలని ప్రజలు చేస్తున్న ఆందోళనకు సీపీఐ పూర్తిమద్దతును ఇస్తుందని జిల్లా కార్యదర్శి పోటు ప్రసాద్ పేర్కొన్నారు. డంపింగ్‌యార్డును ఎత్తివేయాలని స్థానిక ప్రజలు చేస్తున్న దీక్షాశిబిరాన్ని సోమవారం పోటు ప్రసాద్ సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డంపింగ్‌యార్డు వల్ల సుమారు ఐదుకాలనీల పరిధిలోని ప్రజలు ఇబ్బందులు పడుతున్నా అధికార యంత్రాంగం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తోందన్నారు. డంపింగ్‌యార్డులో చెత్త పేరుకుపోవటం వల్ల దుర్గంధం వస్తున్నదని, తద్వారా ప్రజలు శ్వాసకోశ వ్యాధులతో బాధ పడుతున్నారన్నారు. వెంటనే డంపింగ్‌యార్డును ఎత్తివేయకుంటే సీపీఐ ఆధ్వర్యంలో ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యవర్గసభ్యులు పోటు కళావతి, మేకల శ్రీనివాసరావు, సీపీఐ జిల్లా కౌన్సిల్‌సభ్యుడు బోడా వీరన్న పాల్గొన్నారు.

అటానమస్ ప్రమాణాలను పాటించాలి

ఎస్‌బీఐటీని సందర్శించిన జేఎన్‌టీయూ రిజిస్ట్రార్

ఖమ్మం ఖానాపురంహవేలి సెప్టెంబరు 23: అటానమస్ హోదాను దక్కించుకున్న ఎస్‌బీఐటీ కళాశాల అటానమస్ ప్రమాణాలను పాటించాలని జేఎన్‌టీయూ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ కె.వెంకటేశ్వరరావు అన్నారు. సోమవారం నగరంలోని ఎస్‌బీఐటీ ఇంజనీరింగ్ కళాశాలను జేఎన్‌టీయూ రిజిస్ట్రార్, బృందం సందర్శించారు. కళాశాలలో సౌకర్యాలు అందుబాటులో ఉంచటం, విద్యార్థులకు బోధన సౌకర్యాలు కల్పించటంలో కళాశాల జేఎన్‌టీయూ ప్రమాణాలకు అనుగుణంగా ఉన్నాయన్నారు. కళాశాలలోని ల్యాబ్, ఇతర మౌలిక సౌకర్యాలను సందర్శించారు. విద్యార్థులతో పలు విషయాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం వరద బాధితుల విద్యార్థులకు, సిబ్బందికి ఆర్థిక సహాయాన్ని అందించారు. జేఎన్‌టీయూ రిజిస్ట్రార్‌ను. బృందానికి కళాశాల యాజమాన్యం ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కళాశాల సెక్రటరీ, కరస్పాండెంట్ జీ.ధాత్రీ, ప్రిన్సిపాల్ రాజ్‌కుమార్, జెఎన్‌టీయూ బృందంలో ప్రొఫెసర్ వెంకటేశ్వరరెడ్డి, ప్రొఫెసర్ రమేష్, కళాశాల వైస్ ప్రిన్సిపాల్ అమిత్ బింధాజ్, గంధం శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

క్రైం సమాచారం



క్యాబిన్‌లో ఇరుక్కుపోయిన గోపి

ఆగి ఉన్న లారీని ఢీకొన్న వ్యాన్...

- క్లీనర్ మృతి, డ్రైవర్‌కు తీవ్రగాయాలు

వైరా, సెప్టెంబరు 23: వైరా పోలీస్‌స్టేషన్ సమీపంలో సోమవారం ఆగి ఉన్న లారీని కోళ్ల వ్యాన్ ఢీకొనడంతో క్లీనర్ దుర్మరణం చెందాడు. డ్రైవర్‌కు తీవ్రగాయాలయ్యాయి. తల్లాడ నుంచి కోళ్లను ఖమ్మంలో దిగుమతి చేసి తిరిగి తల్లాడ వెళ్తుండగా సోమవారం తెల్లవారుజామున నాలుగుగంటల సమయంలో పోలీస్‌స్టేషన్ ఎదురుగా రోడ్డు పక్కన నిలిపిన లారీని కోళ్ల వ్యాన్ ఢీకొంది. వ్యాన్ ముందుభాగం నుజ్జునుజ్జు కావడంతో తల్లాడకు చెందిన క్లీనర్ తమ్మిశెట్టి గోపి(19)క్యాబిన్‌లో ఇరుక్కుపోవడంతో అతి కష్టంమీద స్థానికులతో కలిసి పోలీసులు బయటకు తీశారు. తీవ్రంగా గాయపడి గోపి అక్కడికక్కడే మృతిచెందాడు. ఈ ప్రమాదంలో తల్లాడకు చెందిన వ్యాన్ డ్రైవర్ నవీన్ తీవ్రంగా గాయపడ్డాడు. సంఘటనాస్థలానికి వైరా ఎస్ఐ వంశీకృష్ణ భాగ్యరాజ్ చేరుకొని కేసు నమోదుచేశారు. తీవ్రంగా గాయపడిన డ్రైవర్‌ను చికిత్స కోసం ఖమ్మం ఆసుపత్రికి తరలించారు.

భార్య కాపురానికి రావడం లేదని ఆత్మహత్య

ముదిగొండ, సెప్టెంబరు 23: భార్య కాపురానికి రావడం లేదని భర్త ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన సోమవారం ముదిగొండ మండలం బాణాపురం గ్రామంలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన ప్రకారం... గ్రామానికి చెందిన బాణాల శ్రీనివాస్(21) హైదరాబాద్‌లో ఓ ప్రైవేట్ ఉద్యోగం చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. ఒక సంవత్సరం క్రితం సూర్యాపేట జిల్లా బరాకత్‌గూడేనికి చెందిన యువతిని ప్రేమించి పెళ్లి చేసుకున్నాడు. గత కొంతకాలంగా భార్యభర్తల మధ్య మనస్పర్థలు రావడంతో యువతి పుట్టింటికి వెళ్లిపోయింది. ఆదివారం తన భార్య కోసం శ్రీనివాస్ బరాకత్‌గూడెం వెళ్లగా తను కాపురానికి రాను అని చెప్పడంతో శ్రీనివాస్ మనోవేదనకు గురై బాణాపురంలోని తన ఇంట్లో దుప్పటితో ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మాజీ సర్పంచ్ భర్త హత్య..



లక్ష్మీదేవిపల్లి, సెప్టెంబరు 23: మండల పరిధిలోని గంగ్రబంధం గ్రామానికి చెందిన తాటి వెంకటేశ్వర్లు(50) హత్యకు గురైన సంఘటన సోమవారం చోటుచేసుకుంది. ఉమ్మడి బంగారుచెలక గ్రామపంచాయతీ మాజీ సర్పంచ్ తాటి రాధ భర్త వెంకటేశ్వర్లు పొలాల్లో కోతుల బెడద ఉండటంతో రోజు తన వెంట తీసుకెళ్లిన కుక్కను పొలంలో వదిలి తిరిగి ఇంటికి వస్తుంటాడు. రోజుమాదిరిగా పొలంకు వెళ్లిన వెంకటేశ్వర్లు తిరిగి ఇంటికి రాకపోవడంతో కుటుంబసభ్యులు అతని కోసం పోలం వద్దకు వెళ్లి వెతికారు. తమ గుంపులోనే వెంకటేశ్వర్లు మృతి చెంది ఉన్నాడని కొందరు గొత్తికోయలు కుటుంబసభ్యులు తెలపడంతో అక్కడికి వెళ్లి మృతదేహాన్ని చూసి కన్నీరుమున్నీరయ్యారు. ఈ సంఘటనపై పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఇసుక లారీ పట్టివేత....

పాల్వంచ, సెప్టెంబరు 23 : అక్రమంగా ఇసుకను తరలిస్తున్న లారీని పాల్వంచ టౌన్ పోలీసులు సోమవారం సీజ్ చేసారు. పాల్వంచ పట్టణ పరిధిలోని శ్రీనివాసకాలనీ నుంచి ఇసుకను వేరే ప్రాంతానికి తరలిస్తుండగా టౌన్ పోలీసులు లారీని పట్టుకుని స్టేషన్‌కు తరలించారు. లారీ యజమాని చల్లా రాంబాబుపై కేసు నమోదు చేసినట్లు టౌన్ ఎస్ఐ సుమన్ తెలిపారు.

రైస్ మిల్లుపై సివిల్ సప్లయీస్ దాడి


- రంగంలోకి దిగిన రాష్ట్ర ఎన్‌ఫోర్స్‌మెంట్ టీమ్
- 14వేల 367 క్వింటాల ధాన్యంపై ఆరా
- ధాన్యం లేదు... బియ్యం లేవు...
- పరారీలో రైస్ మిల్లు యజమాని



రైస్ మిల్లును తనిఖీ చేస్తున్న అధికారులు

మణుగూరు,సెప్టెంబరు 23 : పినపాక నియోజకవర్గంలో మణుగూరు మునిసిపాలిటీ పాత మణుగూరు గ్రామంలోని ఓ రైస్‌మిల్లు పై రాష్ట్ర ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారుల బృందం సోమవారం ఆకస్మికంగా దాడులు నిర్వహించారు. 14 వేల 367 క్వింటాల ధాన్యంపై ఆరా తీయడం మొదులు పెట్టారు. విషయం తెలుసుకున్న మిల్లు యజమాని పరారీలో ఉన్నాడు. ఇందుకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి... పాత మణుగూరు గ్రామంలోని శ్రీసాయి ప్యాడీ రైస్ అండ్ జనరల్ మర్చెంట్‌లో 2022-2023 రబీ సీజన్‌లో సివిల్ సప్లయీస్ అధికారులు 14 వేల 367 క్వింటాల వరిధాన్యాన్ని మిల్లింగ్ చేసి రైస్ ఇవ్వాలని అప్పగించారు. నాటి నుంచి నేటి వరకు ఈ ధాన్యం మిల్లింగ్ చేసి బియ్యం ఇవ్వకపోవడం సివిల్‌సప్లయీస్ అధికారులు, రాష్ట్ర ఎన్‌ఫోర్స్ మెంట్ బృందం రంగంలోకి దిగింది. పలునోటీసులు జారీ చేసినా సదరు యజమాని బొలిశెట్టి విజయ్ భాస్కర్, ఆనంద్ రావు స్పందించకపోవడంతో ఈ మేరకు అధికారులు చర్యలు చేపట్టామని తెలిపారు. రైస్ మిల్లును తనిఖీ చేయగా ఇందుకు సంబంధించి ఎలాంటి బియ్యం స్థానికంగా కన్పించలేదు. ధాన్యం కూడా లేదు. దీంతో సదరు యజమాని భాస్కర్ క్వింటా ధాన్యానికి 2420 చొప్పున రూ. 4,34,63,799 అసలుకు వడ్డీ 25 శాతం తో రూ. 53,83,903 లను కట్టాల్సిఉందన్నారు. మొత్తం మీద రూ 4,88,47,702 లను చెల్లించాలని తెలిపారు. అంతే కాకుండా సివిల్ సప్లయీస్ శాఖకు సంబంధించి జరిగిన మోసంపై రాష్ట్ర ఎన్‌ఫోర్స్ మెంట్ టీమ్ , స్థానిక సివిల్ సప్లయీస్ అధికారుల పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ రాఘవరెడ్డి, ఎన్‌ఫోర్స్ మెంట్ అధికారులు, అధికారులు కమల్ పాషా, ఆర్ పుల్లయ్య, స్వామిదాస్, శివకుమార్, మహేష్, సివిల్ సప్లయీస్ కార్పొరేషన్ అసిస్టెంట్ మేనేజర్ మహేష్ తదితరులు ఉన్నారు.

రిటైర్డ్ ఐజీ శంకర్రావు కన్నుమూత



బోనకల్, సెప్టెంబరు 23: బోనకల్ గ్రామానికి చెందిన స్వాతంత్ర్య సమర యోధుడు, మధిర నియోజకవర్గ తొలితరం ఎమ్మెల్యే బొమ్మకంటి సత్యనారాయణ తనయుడు రిటైర్డ్ ఐజీ శంకర్రావు(82) ఆదివారం కన్నుమూశారు. ఆయనకు భార్య, ఇద్దరు కుమారులు, నలుగురు కుమార్తెలు ఉన్నారు. విధి నిర్వహణలో అంకితభావం, నిజాయితీతో పని చేసిన అధికారిగా పోలీస్‌శాఖలో ఆయనకు మంచి పేరుంది. హైదరాబాద్‌లోని జూబ్లీహిల్స్ నివాసంలో ఉంటున్న శంకర్రావు అంత్యక్రియలను సోమవారం నిర్వహించగా ప్రముఖులు పాల్గొని నివాళులర్పించారు.

బీఆర్ఎస్ నాయకుడిపై కేసు నమోదు

తిరుమలాయపాలెం, సెప్టెంబరు 23: బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు బాషబోయిన వీరన్నపై పోలీసులు కేసు నమోదు చేసి సోమవారం కోర్టుకు రిమాండ్ చేశారు. మండలంలోని జల్లేపల్లి గ్రామంలో ఈనెల 20న గణేస్ నిమజ్జనం సందర్భంగా బీఆర్ఎస్, కాంగ్రెస్ కార్యకర్తల మధ్య గొడవ జరిగింది. ఈనేపథ్యంలో కాంగ్రెస్ కార్యకర్తలు తమ ఇంటిపై వీరన్న దాడిచేసి కొట్టారని పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదుచేయగా ఈమేరకు పోలీసులు వీరనర్నతోపాటు బీఆర్ఎస్ కార్యకర్తలు నలుగురిపై కేసు నమోదుచేశారు. సోమవారం వీరన్నతోపాటు అల్లి సురేష్‌ను అరెస్టు చేసి కోర్టుకు రిమాండ్ చేసినట్టు ఎస్ఐ జగదీష్ తెలిపారు.

యువతి అదృశ్యం.. కేసు నమోదు

పాల్వంచ, సెప్టెంబరు 23: యువతి అదృశ్యమైన ఘటనపై పాల్వంచ రూరల్ పోలీసులు సోమవారం కేసు నమోదు చేశారు. మండల పరిధిలోని జగన్నాథపురం గ్రామానికి చెందిన ధర్మసోతు పావని(19) చదువు మానేసి ఇంటి పట్టునే ఉంటూ.. తరచూ కూలిపనులకు వెళుతుంది. ఇటీవల ఆమెకు వివాహం చేయడానికి ఇంట్లో వారు సిద్దపడ్డారు. పెండ్లి సంబంధం ఇష్టం లేకనో, మరి ఇతర కారణాలతోనో తెలియదు కానీ ఆదివారం సాయంత్రం తండ్రి వద్ద రూ.300 తీసుకుని బయటకు వెళ్లిన యువతి ఎంతకూ తిరిగి ఇంటికి రాలేదు. దీంతో తల్లిదండ్రులు చుట్టుప్రక్కల, బంధువుల ఇళ్లలో వెతికారు. ఎంతకూ ఆమె ఆచూకీ లభించకపోవడంతో పోలీసులను ఆశ్రయించారు. యువతి తండ్రి బాలాజీ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు రూరల్ ఎస్ఐ సురేష్ తెలిపారు.

వ్యక్తి అదృశ్యం..

పాల్వంచ, సెప్టెంబరు 23: వ్యక్తి ఆదృశ్యమైన ఘటనపై పాల్వంచ రూరల్ పోలీసులు సోమవారం కేసు నమోదు చేసారు. మండల పరిధిలోని రేపల్లెవాడకు చెందిన గంగుల తిరుపతయ్య(35) స్థానికంగా డ్రైవర్‌గా జీవనం సాగిస్తున్నాడు. ఈ నెల 16న ఇంటి నుంచి బయటకు వెళ్లిన తిరుపతయ్య ఎంతకూ ఇంటికి తిరిగిరాకపోవడంతో కూటుంబ సభ్యులు పోలీసులను ఆశ్రయించారు. గతంలో తిరుపతయ్య ఇంటి నుంచి వెళ్లి కొన్ని రోజులకు తిరిగి వచ్చాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు రూరల్ ఎస్ఐ సురేష్ తెలిపారు.

ముగ్గురు అజ్ఞాత మావోయిస్టుల అరెస్ట్



వివరాలను వెల్లడిస్తున్న ఎస్పీ రోహిత్‌రాజ్

కొత్తగూడెం, సెప్టెంబర్ 23(ఆంధ్రజ్యోతి): మావోయిస్టు పార్టీకి చెందిన ఇద్దరు అజ్ఞాత దళసభ్యులు, ఒక మహిళా కొరియర్‌ను భద్రాద్రి జిల్లా పోలీసులు అరెస్టు చేశారు. ఎస్పీ రోహిత్‌రాజ్ సోమవారం కొత్తగూడెం ఎస్పీ కార్యాలయంలో వివరాలను వెల్లడించారు.

చర్ల పోలీస్‌స్టేషన్ పరిధిలోని దానవాయిపేట గ్రామ శివారులో వాహనాలు తనిఖీ చేస్తుండగా వరంగల్‌లో వైద్య చికిత్సలు చేయించుకుని మళ్లీ అడవిలోకి వెళ్తున్న ఇద్దరు అజ్ఞాత దళసభ్యులను చర్ల పోలీసులు అరెస్టు చేశారు. వీరి నుంచి మావోయిస్టు పార్టీకి చెందిన ముఖ్యమైన పత్రాలు, విప్లవ సాహిత్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. వీరితోపాటు ఒక మహిళ కొరియర్‌ను కూడా పోలీసులు అరెస్టు చేశారు.

అరెస్టయిన వారిలో ఛత్తీస్‌గఢ్‌లోని సుకుమా జిల్లా కిష్టారం పోలీస్‌స్టేషన్ పరిధిలో బూరుగులంక గ్రామానికి చెందిన కరటం జోగ అలియాస్ రాజేష్, బీజీపూర్ జిల్లా జేగూరుగుండ పోలీస్‌స్టేషన్ పరిధిలో కొండపల్లి గ్రామానికి చెందిన పూనం జోగాల్ అలియాస్ రాజు, చర్ల మండలానికి చెందిన మావోయిస్టు పార్టీ కొరియర్ ఎం. గీతా గాయత్రి ఉన్నారు. వీరిలో కరటం జోగపై రూ.20లక్ష రివార్డు ఉంది. ఇతడు 1994లో మావోయిస్టు పార్టీలో చేరాడు. ఇతడు అనేక విధ్వంసక ఘటనల్లో పాల్గొన్నాడు. పార్టీలో అంచలంచెలుగా ఎదిగి సౌత్‌బస్తార్ మిలిటరి డివిజన్ విభాగానికి ఇంచార్జ్ స్థాయికి చేరుకున్నాడు. ఇక పూనం జోగాల్ అలియాస్ రాజు 2022లో మావోయిస్టు పార్టీలో చేరి సౌత్‌బస్తర్ డివిజన్‌లోని జేగూరుకొండ ఏరియా కమిటీలో ఎల్‌వోఎస్‌సభ్యుడిగా పని చేశాడు. ఇతను కూడా మావోయిస్టు అగ్రనాయకులతో కలిసి బీజాపూర్, సుకుమా జిల్లాలో భద్రత బలగాలపై జరిగిన హింసాత్మక ఘటనలో పాల్గొన్నట్లు ఎస్పీ తెలిపారు.

కళాశాల భవనం పైనుంచి దూకి విద్యార్థి ఆత్యహత్య

ఖమ్మం ఖానాపురంహవేలి, సెప్టెంబరు 23: నగరంలోని వైరా రోడ్ లో గల ఓ ప్రైవేటు జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం విద్యార్థి ఎం. లోకేష్(16) కళాశాల రెండో అంతస్తు పైనుంచి దూకి ఆత్యహత్యకు పాల్పడ్డ సంఘటన సోమవారం ఉదయం జరిగింది. సూర్యపేట జిల్లా చివ్వెల మండలం మట్టపల్లి గ్రామానికి చెందిన విద్యార్థి తల్లిదండ్రులు మట్టిపల్లి తిరుపయ్య, రేణుక తెలిపిన వివరాల ప్రకారం.. లోకేష్‌కు ఎలాంటి దుర అలవాట్లు లేవని అర్ధరాత్రి కళాశాల రెండో అంతస్తు ఎక్కల్సిన అవసరం లేదన్నారు. ఇది కేవలం కొందరు ద్వితీయ సంవత్సర విద్యార్థుల పనేనని, కళాశాల వార్డ్‌న్ విధుల నిర్లక్ష్యంగానే తమ కుమారుడు మృతి చెందాడని అన్నారు. ఇది కేవలం కళాశాల యాజమాన్య నిర్లక్ష్యంగానే జరిగిన సంఘటన అని ఆవేదన వ్యక్తం చేశారు. రెండో అంతుస్తుపైనుంచి దూకిన లోకేషన్‌ను కళాశాల యాజమాన్యం వెంటనే నగరంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించి చికిత్స అందించారు. చికిత్స జరుగుతుండగానే విద్యార్థి మృతి చెందాడు. విషయం తెలుసుకున్న పలువురు విద్యార్థి సంఘాల నాయకులు విద్యార్థి తల్లితండ్రులతో కలిసి కళాశాల ముందు ధర్నా నిర్వహించారు. కళాశాల నిర్వాహకుల నిర్లక్ష్యం వల్లే తమ కుమారుడు మృతి చెందాదని లోకేష్ తండ్రి పోలీసులకు ఫిర్యాదు చేయగా, పోలీసులకు కేసు నమోదు చేశారు.

చికిత్స పొందుతూ విద్యార్థిని మృతి

దుమ్ముగూడెం, సెప్టెంబరు 23: మండల పరిధిలోని అంజుబాకకు చెందిన విద్యార్థిని(17) చికిత్స పొందుతూ సోమవారం మృతిచెందింది. ఓ కళాశాలలో ఇంటర్ చదువుతున్న విద్యార్థిని ఈనెల 18న పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నం చేసింది. భద్రాచలంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతుండగా, పరిస్థితి విషమించింది. ఎస్ఐను వివరణ కోరగా, తమకు ఎటువంటి సమాచారం అందలేదన్నారు.

గణపేశ్వరాలయాన్ని సందర్శించిన అసిస్టెంట్ స్థపలి

కూసుమంచి, సెప్టెంబరు 23: కూసుమంచి శివాలయాన్ని దేవాదాయశాఖ అసిస్టెంట్ స్థపలి గణేష్ సోమవారం సందర్శించారు. ఆలయంలో నిర్మాణం చేపట్టేందుకు సంబంధించిన రాజగోపురం, భక్తుల విశ్రాంతి మండపం, ఇతరత్రా నిర్మాణాలు చేపట్టేందుకు అవసరమైన సౌకార్యలను పరిశీలించారు. వాటి కొలతలు తీసుకున్నారు. ఈవోకు పలుసూచనలు సలహాలు అందించారు. త్వరలో ప్లాను అందిస్తామని అన్నారు. కార్యక్రమంలో ఈవో శ్రీకాంత్, ప్రధానఅర్చకులు శేషగిరిశర్మ, చైర్మన్ రేల ప్రదీప్‌రెడ్డి, గ్రామపెద్దలు చెన్న మోహన్, మాదాసు ఉపేందర్, దామోదర్‌రెడ్డి, వీరబాబు, చంద్రయ్య, రెడ్యానాయక్, తదితరులు పాల్గొన్నారు.

అథ్లెటిక్స్‌లో మెరిసిన ముబీన్



కొణిజర్ల, సెప్టెంబరు 23: హైదరాబాద్‌లో జరిగిన రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీలలో షాట్‌పుట్ విభాగంలో మండలంలోని మైనారిటీ బాలుర పాఠశాల విద్యార్థి ఎస్‌కే ముబీన్ సిల్వర్‌మెడల్ సాధించినట్లు పాఠశాల ప్రిన్సిపాల్ జితేష్‌సాహిల్ సోమవారం తెలిపారు. అలాగే 100మీటర్ల రన్నింగ్‌లో పాఠశాలకు చెందిన అక్తర్ రన్నర్‌అప్‌గా నిలిచాడన్నారు. ఈ సందర్భంగా రాష్ట్రస్థాయిలో కీర్తిసాధించిన విద్యార్థులను ప్రిన్సిపాల్‌తో పాటు పీడీ రవికుమార్, పీఈటీ హరీష్, సిబ్బంది అభినందించారు.

వరికి తెగులు.. రైతుకు దిగులు..



- నాట్లు అయిన నెలకే ఆశిస్తున్న బ్యాక్టీరియా, వైరస్ రకాలు
- రక్షణ కోసం మందులు పిచికారి చేస్తున్న అన్నదాతలు
- దిగుబడుల తగ్గుతాయోమేనని తీవ్ర ఆందోళన
- జాగ్రత్తలు తీసుకోవాలంటున్న వ్యవసాయాధికారులు

కరకగూడెం, సెప్టెంబరు 23: వరి పంట తెగుళ్లబారిన పడి నాశనం అవుతుంటే రైతుకు నిరాశను మిగిలిస్తుంది. వానకాలం పంటకు వర్షాలు ఎక్కువగా ఉండటం. తెగుళ్ల ముప్పేట దాడి చేయడంతో దిగుబడులు రాక అప్పులు పాలు అవకతప్పదని రైతులు ఆందోళన చెందుతున్నారు. ప్రతీ సంవత్సరం కూడా పంట దశలో ఎకరాకు 20 నుంచి 25 కాంటాలు అవడంతో రైతన్నలు పెట్టిన పెట్టుబడులు రాలేక పెట్టిన పెట్టుబడులు రాక అప్పులు మిగిలాయని వాపోతున్నారు. సాగు చేసి నెల రోజుల నుంచి తెగుళ్ల పంటపై దాడి చేశాయి. పంటపై బ్యాక్టిరియా ఎండితెగులు, ఉల్లికోడు, అగ్గితెగులు, ఆకుముడత, పురుగుతో రైతులు అనేక రకాల మందులను పంటపై పిచికారి చేసిన శున్యంగా మిగిలిందని రైతులు ఆవేధన వ్యక్తం చేశారు. పంట చేతికి అందే దశలో పురుగుతో వరి కంకులలో పురుగు తెగులు ఉండటంతో అవి తెల్లకంకులుగా మారి ఈదు పోయి దాన్యం కాకుండ పోతుందని.. మరో వైపు పండు తెగులు, దోమ తెగుళ్ళు, అగ్గి తెగుళ్ళు వంటి తెగుళ్ళు ముప్పేట దాడి చేస్తున్నాయని ఆందోళన చెందుతున్నారు. వేల రూపాయాల మందులు పంటలపై పిచికారి చేసిన ఫలితం లేకుండా పోతుందని.. పంట ఎదుగుదల కూడా తగ్గిందని దిగుబడులు రాక ఇంకా అప్పులు పాలు అవక తప్పదని రైతులు వాపోతున్నారు.

లక్ష 60వేల ఎకరాలలో వరి పంటసాగు

పినపాక నియోజక వర్గంలో రైతులు వానకాలం పంటగా వరి పంటను 53వేల 400 వందల ఎకరాలు సాగుచేశారు. ఇందులో వ్యవసాయ శాఖ అధికారులు వేసిన అంచన ప్రకారం. కరకగూడెం మండలంలో 9800 ఎకరాలు, పినపాక మండలంలో 12650, మణుగూరు మండలంలో 6400, అశ్వాపురం మండలంలో 9000, బూర్గంపాడు మండలంలో 6500, గుండాల మండలంలో 4400, ఆళ్ళపల్లి మండలంలో 4700 ఎకరాలతో నియోజకవర్గంలో మొత్తం 53 వేల 400 ఎకరాలు వరి పంటను రైతులు సాగుచేశారు.

జాగ్రత్తలు తీసుకోవాలి, ఏవో ఛటర్జీ



బ్యాక్టీరియా ఎండుతెగులు ఆచినప్పుడు స్ట్రెప్టోమైసిన్ ప్లస్ తెత్ర సిక్లిన్‌తో పాటు మేటల క్సిన్ ప్లెస్ క్లోరోతాలిన్ పిచికారి చేయాలన్నారు. అగ్గితెగులు ఆచినప్పుడు పైరాక్లోస్ట్రోబిన్ ప్లెస్ డిఫినాకోనచోల్ పిచికారి చేయాలన్నారు. పసుపు రంగు వరి ఆకులకు ఆచినప్పుడు చిలమినే జింక్ 2 ఎంఎల్ పేర్ లీటర్ నీటిలో కలిపి పిచికారి చేయాలన్నారు. రైతులు నాటు వేసిన రెండు రోజులలో కాలిబాటలు(పాయాలు)తీసుకోవాలి. దాంతో దోమతెగులు వంటి తెగుళ్ల రాకుండా ఉంటుంది.

కనికరించండి సారూ..

- ఓ వికలాంగురాలి దీనగాథ..



అధికారులను వేడుకుంటున్న వికలాంగురాలు

ఖమ్మం కలెక్టరేట్, సెప్టెంబరు 23: వికలాంగురాలినైనా... చదువుకున్నా డిగ్రీ పూర్తి చేశా...లైబ్రరీ సైన్స్ పూర్తి చేశా... నా తమ్ముడు చనిపోయాడు.. అమ్మానాన్న నాపైనే ఆధారపడి జీవిస్తున్నారు.. నాకో ఉపాధి మార్గాన్ని చూపించి కనికరించండి సారూ...! అంటూ ఓ వికలాంగురాలు దీనగాథను వినిపించారు. సోమవారం ఖమ్మం జిల్లా కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి తిరుమలాయపాలెం మండలం సుబ్లేడుకు చెందిన పట్టేటి సైదమ్మ అదనపు కలెక్టర్ శ్రీజను కలిశారు. తన గ్రామంలో మీసేవకు దరఖాస్తు చేస్తే మహిళాసంఘానికి వచ్చిందని కానీ దాన్ని కూడా తనకు కేటాయించ లేదని.. తాను చదువుకున్నా దానికి తగిన విధంగా ఉపాధి లేక పోవడంతో తల్లిదండ్రులను సాదలేక పోతున్నానంటూ వేడుకుంది. లైబ్రేరీ సైన్స్ చదివిన తనకు ఉపాధి కల్పించి ఆదుకోవాలంటూ ఆ వికలాంగ మహిళ అధికారుల చుట్టూ తిరగడం అక్కడి వారిని కలిచి వేసింది.

ప్రభుత్వ స్థలాల ఆక్రమణలు సహించం

- మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి

ఇల్లెందు, సెప్టెంబరు 23: రాష్ట్రంలో కబ్జాలకు గురైన ప్రభుత్వ స్థలాలు, భూములను వెంటనే స్వాధీనం చేసుకోవాలని, భూములు కబ్జాలకు గురైతే రెవెన్యూ అధికారులే బాధ్యత వహించాల్సి ఉంటుందని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి స్పష్టం చేశారు. ప్రభుత్వ భూములు, స్థలాలు కబ్జాచేసిన వారు ఎమ్మెల్యేలైనా, ఏ స్థాయిలో ఉన్నా కఠినంగా వ్యవహరించాలని తేల్చిచెప్పారు.

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఇల్లెందు పట్టణంలో సోమవారం ఇల్లెందు నియోజకవర్గస్థాయి అధికారులతో సమీక్ష సమావేశం జరిగింది. ఎమ్మెల్యే కోరం కనకయ్య అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో మంత్రి పొంగులేటి ప్రసంగిస్తూ ప్రజా ప్రభుత్వ విధి విధానాలు, ఆలోచనలు ఇప్పటికే వివిధ సందర్భాల్లో అధికారులకు వివరించడం జరిగిందని, కానీ కొన్ని శాఖల అధికారులు నిర్లక్ష్యంగా తమ పాతపద్ధతుల్లోనే పనిచేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వ ఆలోచనలకు భిన్నంగా వ్యవహరించే ఏస్థాయి అధికారులనైనా ఉపేక్షించబోమని స్పష్టం చేశారు. రెవెన్యూ అధికారులు ప్రత్యేకించి గిరిజన ప్రాంతాల్లో సామాన్యులను రెవెన్యూ పరంగా ఇబ్బందులు పెడితే గత ప్రభుత్వ ధరణిని అడ్డంపెట్టుకొని ఇక్కట్లపాలు చేస్తే అధికారులు ఇబ్బందులకు గురికావాల్సి ఉంటుందని మంత్రి హెచ్చరించారు. రెవెన్యూతోపాటు ఐటీడీఏ, విద్య, వైద్యం, వ్యవసాయం, పంచాయతీరాజ్, ఆర్అండ్‌బీ తదితర అన్ని శాఖల్లోనూ అధికారులు తీరు మార్చుకోవాలన్నారు.

స్థానిక ఎమ్మెల్యేలతో ప్రతి అంశాన్ని సమన్వయం చేసుకొంటూ వారి సూచనలతో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు అమలు చేయాలని అధికారులను కోరారు. అర్హులైన పేదలందరికీ తెల్లరేషన్ కార్డులు, హెల్త్ కార్డులు జారీ చేసే ప్రక్రియ పది రోజుల్లో ప్రారంభంకాబోతుందని వచ్చేనెలలో ఇందిరమ్మ గృహనిర్మాణ పథకం అమలు చేయబోతున్నందున అర్హులైన పేదలను పార్టీలకు అతీతంగా నిరుపేదలను గుర్తించి అర్హుల జాబితాలను సిద్ధం చేయాలని ఆదేశించారు. ఈ సమావేశంలో మహబూబాబాద్ పార్లమెంటు సభ్యుడు పోరిక బలరాం నాయక్, ఇల్లెందు ఎమ్మెల్యే కోరం కనకయ్య, భద్రాద్రి కొత్తగూడెం కలెక్టర్ జితేష్ వీ పాటిల్, మహబూబాబాద్ జిల్లా కలెక్టర్ అద్వైత్ కుమార్‌సింగ్, ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి రాహుల్, ఎస్పీ రోహిత్‌రాజ్, ఇరిగేషన్ కార్పొరేషన్ చైర్మన్ మువ్వా విజయ్‌బాబు, ఇల్లెందు మునిసిపల్ చైర్మన్ దమ్మాలపాటి వెంకటేశ్వరరావు, మూడు జిల్లాల పరిధిలోని వివిధ ప్రభుత్వ శాఖల ఉన్నతాధికారులు, మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.

రూ.23 కోట్ల అభివృద్ధి పనులకు శ్రీకారం

మంత్రి పొంగులేటి సోమవారం ఇల్లెందు మండలం, పట్టణంలో రూ.23 కోట్ల విలువైన అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేశారు. ఈ కార్యక్రమంలో మంత్రితోపాటు ఎంపీ పోరిక బలరాం నాయక్, ఎమ్మెల్యే కోరం కనకయ్య, కలెక్టర్ జితేష్ వీ పాటిల్, మునిసిపల్ చైర్మన్ డి.వెంకటేశ్వరరావు పాల్గొన్నారు. ఇల్లెందు మండలంలో ముకుందాపురం-కట్టుగూడెం, మేడికుంట-రామచంద్రుడిపేట బీటీ రోడ్ల నిర్మాణం పనులకు, ఇల్లెందులపాడులో స్విమ్మింగ్‌పూల్ నిర్మాణం పనులకు, బుగ్గవాగు రిటైనింగ్‌వాల్ నిర్మాణ పనులు, మునిసిపల్ మోడల్ మార్కెట్ ప్రహారీ పనులకు శంకుస్థాపన చేశారు. అదేవిధంగా ఆర్అండ్‌ఆర్ కాలనీలో ఏర్పాటు చేసిన మునిసిపల్ పార్కును, ఓపెన్‌జిమ్‌ను ప్రారంభించారు.

కాగా, మంత్రి హోదాలో తొలిసారి ఇల్లెందుకు వచ్చిన పొంగులేటికి ఘన స్వాగతం లభించింది. మునిసిపల్ చైర్మన్ వెంకటేశ్వరరావుతోపాటు కాంగ్రెస్ నాయకులు కోరం సురేందర్, దొడ్డా డానియల్, పులి సైదులు, మూల మధుకర్‌రెడ్డి, మేకల మల్లిబాబు, దుర్గాప్రసాద్, బయ్యారం, కామేపల్లి, టేకులపల్లి, గార్ల మండలాల నుంచి కాంగ్రెస్ నాయకులు కార్యకర్తలు ఘన స్వాగతం పలికారు. మంత్రి పర్యటన సందర్భంగా అటవీ ప్రాంతాల రహదారులపై భారీ ఎత్తున పోలీసు బలగాలను మోహరించారు. ఇల్లెందు డీఎస్పీ చంద్రభాను, ఇల్లెందు సీఐ, టేకులపల్లి సీఐలు బత్తుల సత్యనారాయణ, తాటిపాముల సురేష్‌ల ఆధ్వర్యంలో బందోబస్తు ఏర్పాటు చేశారు.

ప్రజావాణిలో వినతుల వెల్లువ

(5వ పేజీ తరువాయి)

వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

భారీ వర్షాలకు మత్స్యకారులకు తీరని నష్టం

ఎం వెంకటేశ్వర్లు, జిల్లా సహకార సంఘాల చీఫ్ ప్రమోటర్

భారీ వర్షాల కారణంగా జిల్లాలోని మత్స్యకారులు తీవ్రంగా నష్టపోయారు. చెరువులు, కుంటల్లో లక్షలాది విలువైన చేపపిల్లలు వర్షాలకు కొట్టుకుపోయాయని కోట్లలో నష్టం వాటిల్లిందని కలెక్టర్ ముందు వాపోయారు. మత్స్యకార కుటుంబాలకు తక్షణమే పదివేల ఆర్థిక సహాయాన్ని అందించి ఆదుకోవాలని, మహిళా సంఘాలకు రివాల్వింగ్ ఫండ్‌ను ఏర్పాటు చేసి ఆర్థికాభివృద్ధికి సహకరించాలి.

పట్టాదారు పాసుపుస్తకాలు పాడైపోయాయి

● తమ్మినేని రంగారావు, రైతు సీతారాంపురం

మున్నేరు వరదల కారణంగా ఖమ్మంలో ఉంటున్న మా భూముల పాసుపుస్తకాలు పాడైపోయాయి. ఇవి ఎక్కడ తీసుకోవాలో అర్థం కావడం లేదు. కలెక్టర్, జేసీ ఇతర అధికారులను కలుద్దాం అని వచ్చాం. కానీ ఎవరూ సమాధానం చెప్పే వారే లేరు. ఎంతో మంది రైతుల పరిస్థితి ఇలాగే ఉంది. దీనిపై ప్రభుత్వం జిల్లా అధికారులు స్పష్టమైన సమాచారాన్ని రైతులకు అందివ్వాలి.



నా ఇంటి స్థలాన్ని ఆక్రమించారు

● పామర్తి లక్ష్మి, పాండురంగాపురం

ఖమ్మం నగరంలోని నా పేరుతో మూడు గదుల ఇల్లు ఉంది. దీని ఇంటి నెంబర్ 14-8-192. కానీ సెప్టెంబరు 22న అక్రమంగా చింతకాని రెవెన్యూకు చెందిన 81/2003 డాక్యుమెంట్‌తో మునిసిపాలిటీలో పామర్తి రామారావు తన పేరుతో మ్యూటేషన్ చేయించుకున్నాడని మునిసిపల్ సిబ్బంది అక్రమంగా తన పేరుతో ఉన్న ఇంటిని తనకు తెలియకుండానే మార్చేసారంటూ ఆవేదన వ్యక్తం చేసింది. ఇదే ఆస్థిని రామారావు తన భార్య పేరుతో చేయించుకున్నాడని, ఇంత టి అక్రమానికి పాల్పడిన వారిపై చర్యలు తీసుకోవాలని, తన ఇంటిని తనకు స్వాధీనం చేయాలి.

రైతులకు అండగా ఉంటాం..

- నేడు సాగర్ కాలువకు నీటిని విడుదల చేస్తాం
- అమృత్ స్కీమ్‌లో అవినీతికి పాల్పడినట్లు రుజువు చేస్తే రాజీనామా చేస్తా
- మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి
- త్వరలోనే పంటల బీమా పథకం అమలు: మంత్రి తుమ్మల
- ఘనంగా నేలకొండపల్లి మార్కెట్ కమిటీ ప్రమాణ స్వీకారం



మాట్లాడుతున్న మంత్రి తుమ్మల

నేలకొండపల్లి, సెప్టెంబరు 23: ఇటీవల కురిసిన వర్షాలకు గండి పడిన సాగర్‌కాల్వ గండి పూడ్చివేత పనులు పూర్తి అయ్యాయని, మంగళవారం నీటిని వదులుతామని పాలేరు శాసనసభ్యుడు, మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. నేలకొండపల్లిలో సోమవారం రాత్రి వ్యవసాయ మార్కెట్ కమిటీ ప్రమాణ స్వీకారోత్సవ సభలో పొంగులేటి పాల్గొన్నారు. శాఖమూరి రమేష్ అధ్యక్షతన జరిగిన సభలో పొంగులేటి మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా అనేక ప్రాంతాల్లో భారీ వర్షాలు పడటం వలన భారీ నష్టం జరిగిందన్నారు. ముఖ్యంగా ఉమ్మడి ఖమ్మం జిల్లాలో కోలుకోలేని నష్టం జరిగిందన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి స్వయంగా ఖమ్మం జిల్లాకు వచ్చి వరద ప్రాంతాలను సందర్శించి సహాయం ప్రకటించారన్నారు. భారీ నష్టం జరిగినప్పటికీ కేంద్రం ఒక్క రూపాయి సహాయం చేయలేదన్నారు. ఇసుక మేటలు వేసిన ప్రతి ఎకరాకు రెండు రోజుల్లో రూ.10వేలు అందిస్తామన్నారు. సాగర్ కాల్వ నాలుగు చోట్ల తెగిందని, అన్ని చోట్ల గండ్లను పూడ్చి, మంగళవారం నీటిని వదులుతామన్నారు. అమృత్ స్కీంలో 8,888కోట్ల అవినీతి జరిగిందని బావా, బామ్మర్థులు గొంతు చించుకుంటున్నారని, అవినీతిని నిరూపిస్తారా? అని పొంగులేటి సవాల్ విసిరారు. అమృత్ స్కీంలో టెండరు బీఆర్ఎస్ నాయకుడు కందాళ అల్లుడు సృజన్‌రెడ్డిదన్నారు. తాను అవినీతికి పాల్పడ్డానని నిరూపిస్తే మంత్రి పదవికి రాజీనామా చేస్తానని, లేకుంటే, మీ శాసనసభ్యత్వాలకు రాజీనామాలు చేస్తారా? ఎన్ని గంటలకు ఎక్కడకు రావాలో చెప్పండి.. అక్కడకు వస్తానని సవాల్ విసిరారు.

అందరికీ రుణమాఫీ చేస్తాం : మంత్రి తుమ్మల

ఎన్నికల్లో పార్టీ ఇచ్చిన అన్ని వాగ్దానాలను అమలు చేసి తీరుతామని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు స్పష్టం చేసారు. ఏఎంసీ ప్రమాణ స్వీకారోత్సవ సభలో తుమ్మల ముఖ్య అతిధిగా పాల్గొని మాట్లాడారు. రైతులకు రూ.31వేల కోట్లిచ్చిన ఏకైక ప్రభుత్వం ఇందిరమ్మ ప్రభుత్వమన్నారు. ప్రతి ఒక్కరికీ రుణమాఫీ చేస్తామని, ఎవరూ అధైర్యపడొద్దన్నారు. తెల్లకార్డు లేనివారికి కూడా రుణమాఫీ చేస్తామన్నారు. రైతుల మెదటి పంటకాలంలో రుణమాఫీ ప్రక్రియ పూర్తిచేస్తామన్నారు. త్వరలోనే పంటల బీమా అమలు చేయబోతున్నట్లు చెప్పారు. నేలకొండపల్లి పెద్ద మార్కెట్ అని, త్వరలోనే మద్దులపల్లి మార్కెట్ నిర్మాణం పూర్తి చేస్తామన్నారు. మార్కెట్ నిర్మాణానికి రూ.20కోట్లు కేటాయించినట్లు చెప్పారు.

రైతులు పామాయిల్ సాగుపై దృష్టిపెట్టాలని కోరారు. 10వేల ఎకరాలు దాటితే పొంగులేటి సహకారంతో నేలకొండపల్లిలో పామాయిల్ ఫ్యాక్టరీ పెడతానన్నారు. కష్టపడి పనిచేసే వారికే పదవులు వస్తాయని, 40 సంవత్సరాల కష్టానికి ఫలితంగానే సీతారాములుకు చైర్మన్ పదవి దక్కిందని అన్నారు. ఈ సమావేశంలో మార్కెట్ చైర్మన్ వెన్నపూసల సీతారాములు, రాయల నాగేశ్వరరావు, మువ్వా విజయ్‌బాబు, నల్లమల వెంకటేశ్వర్లు, సాధు రమేష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు. కాగా, సీతారాములుతో పాటు డైరెక్టర్లతో జిల్లా మార్కెటింగ్ అధికారి ప్రమాణ స్వీకారం చేయంచారు.

ప్రపంచ చెస్‌లో హారిక ప్రతిభ

- చెస్ ఒలింపియాడ్‌లో బంగారు పతకం



ఖమ్మం స్పోర్ట్స్, సెప్టెంబరు 23: ప్రపంచ చదరంగం తెరపై ఆమె తన ప్రతిభతో ఖమ్మం కీర్తి పతాకను రెపరెపలాడించింది. తన మేధస్సుతో దేశ ప్రతిష్టను ఇనుమడింపచేసింది. ఆమె ఎవరో కాదు ప్రఖ్యాత చెస్ క్రీడాకారిణి, ఖమ్మం కోడలు ద్రోణవల్లి హారిక. హంగేరి దేశంలోని బుడాపెస్ట్‌లో జరిగిన 45వ చెస్ ఒలింపియాడ్ పోటీల్లో భారత మహిళల, పురుషుల జట్లు స్వర్ణ పతకాలు సాధించి ప్రపంచ చాంపియన్‌గా నిలిచారు. ప్రపంచంలోని 195దేశాల నుంచి టాప్ ర్యాంకింగ్ క్రీడాకారులు ఈ టోర్నీలో పాల్గొన్నారు. మహిళల జట్టులో ఖమ్మం జిల్లా రఘునాథపాలెం మండలంలోని వి.వెంకటాయపాలెంకు చెందిన ద్రోణవల్లి హారిక ఉండటం విశేషం.

గుంటూరుకు చెందిన హారిక 2018లో ఖమ్మం జిల్లాలోని వి.వెంకటాయపాలెం గ్రామానికి చెందిన హౌసింగ్ డిపార్ట్‌మెంట్ రిటైర్డ్ డీఈ చంద్ర వెంకటేశ్వరరావు కుమారుడు కార్తీక్‌ను వివాహం చేసుకుంది. బాల్యం నుంచే చెస్‌లో అపారప్రతిభను చూపుతున్న హారిక పదేళ్ల వయస్సులోనే గ్రాండ్ మాస్టర్ టైటిల్‌ను సొంతం చేసుకుంది. 2009లో చెన్నైలో జాతీయ మహిళా చెస్ చాంపియన్‌షిప్‌లో గోల్డ్ మెడల్, 2012, 2015, 2017లో చెస్ ఒలింపియాడ్(ప్రపంచ పోటీలు)లో వరుసగా మూడు కాంస్య పతకాలు, 2024 పోటీలో స్వర్ణ పతకం కైవసం చేసుకుంది. 2010లో చైనాలో జరిగిన ఏసియా పోటీల్లో కాంస్య, 2022లో చైనాలో జరిగిన ఆసియా చెస్ పోటీల్లో స్వర్ణ పతకాలు సొంతం చేసుకుంది. ఆమె ప్రతిభను గుర్తించిన భారత ప్రభుత్వం 2007లో అర్జున అవార్డు, 2019లో పద్మశ్రీ అవార్డుతో సత్కరించింది. హారిక మామ చంద్ర వెంకటేశ్వరరావును పలకరించగా.. కోడలి ప్రతిభపై ఆనందం వ్యక్తం చేశారు. హారిక తన ప్రతిభతో ఖమ్మం జిల్లాకు పేరు ప్రఖ్యాతులు తీసుకురావడం అభినందనీయమని అన్నారు. భవిష్యత్‌లో మరిన్ని పతకాలు సాధిస్తుందని అన్నారు.

'అసెస్‌మెంట్'పై దాగుడు మూతలు

(5వ పేజీ తరువాయి)

ఖమ్మం బైపాస్‌రోడ్డులో నూతన బస్టాండ్ ప్రారంభోత్సవం 2021 ఏప్రిల్‌లో జరిగింది. కానీ నాటినుంచి 2024 వరకు అసెస్‌మెంట్ నెంబరు కేటాయించకపోవడం గమనార్హం. కార్పొరేషన్ అధికారులు పంపిన నోటీసులో సైతం 2022 ఏప్రిల్ నుంచి 2024 మార్చి వరకు పన్ను వివరాలను పంపించారు. మరి అంతకుముందు ఏడాది కాలం పన్ను పరిస్థితి ఏంటనే విషయం అధికారులకే తెలియాలి. అంతేకాదు 2024 మే 31న పంపిన నోటీసులో ఈ యేడాదికి సంబంధించిన పన్నును ఎక్కడా ప్రస్తావించకపోవడం ఏమిటన్న ప్రశ్న తలెత్తుతోంది. ఈ రెండు అంశాలను పక్కనపెడితే రెండేళ్లపాటు సంబంధిత పన్నుకు వేయాల్సిన వడ్డీ పరిస్థితి ఏమిటన్నది మరో ప్రశ్న. అసెస్‌మెంట్ నెంబరు కేటాయించినట్లయితే కట్టాల్సిన పన్నుతోపాటు దానికి అయ్యే వడ్డీ మొత్తం సైతం చాలా స్పష్టంగా ఆన్‌లైన్‌లో కనిపిస్తూ ఉంటుంది. కానీ ప్రస్తుతం ఆర్టీసీ బస్టాండ్‌కు కేటాయించిన డోర్ నెంబర్ మునిసిపల్ రికార్డుల్లో లేదని సంబంధిత ప్రాపర్టీ ట్యాక్స్ సైట్‌లో చూపించడం కొసమెరుపు. బస్టాండ్‌కు పన్ను వేశాం అని చెప్పుకుంటున్న అధికారులు మూడేళ్లపాటు ఏమి చేశారన్న విషయంపై జోరుగా చర్చ సాగుతోంది.

తెలియక ఆగారట...

నూతన బస్టాండ్‌కు, ఐటీ హబ్‌కు, వెజ్ అండ్ నాన్‌వెజ్ మార్కెట్లకు సంబంధించి ఎవరిపేరు మీద పన్నులు వేయాలో తెలియక పన్నులు వేయలేదంటూ అధికారులు సమాధానం చెప్పడం గమనార్హం. నూతన బస్టాండ్ స్థలం లీజుకు తీసుకున్న స్థలమని, స్థలం కూడా వేరే శాఖ పేరు మీద ఉందని ఆ కారణంగానే పన్నులు విధించడం ఆలస్యమైందంటూ చేసిన తప్పును కప్పిపుచ్చుకునే ప్రయత్నాలు చేస్తున్నారు. అలా అయితే ఖమ్మం నగరంలో స్థలాలు లీజుకు తీసుకుని నిర్మాణాలు చేపట్టిన వారికి ఎలా పన్నులు విధించారన్న వాదన లేకపోలేదు. అధికారులు చెప్పిన మాటలనే అనుసరిస్తే మరి ప్రస్తుతం ఆర్టీసీ బస్టాండ్ పేరు మీద ట్యాక్స్ కట్టమంటూ ఎలా నోటీసు పంపారో వారికే తెలియాలి. ఇక ఐటీ హబ్‌కు అయితే కనీసం అది కూడా లేదు. ఇక వెజ్ అండ్ నాన్‌వెజ్ మార్కెట్ల విషయానికొస్తే మార్కెటింగ్‌శాఖ ఆధ్వర్యంలో నిర్వహణ సాగుతోంది. బస్టాండ్ పక్కన వెజ్ అండ్ నాన్ వెజ్ మార్కెట్‌లో సుమారు 36షట్టర్లను మార్కెటింగ్ శాఖకు అప్పగిస్తూ 2021లోనే లేఖ ఇచ్చారు కూడా. వాటికి పన్నులు ఎందుకు వేయలేదో అన్న అంశం తెరమీదకు వస్తే ఆ విషయం ఇటీవల కాలంలో తమకు తెలిసినట్టు అధికారులు సమాధానం చెబుతున్నారు. కాగా కేవలం కార్పొరేషన్ అధికారుల నిర్లక్ష్యం కారణంగానే ఏళ్ల గడుస్తున్నా పన్ను విధించలేదన్న విషయం స్పష్టమవుతోంది.

అసెస్‌మెంట్ నెంబరు రాలేదు...

శ్రీనివాసరావు, ఆర్‌వో, ఖమ్మం మునిసిపల్ కార్పొరేషన్

రెండు, మూడుసార్లు ఈ ప్రాపర్టీ ఎవరిదంటూ పలుమార్లు లేఖలు పంపాం. వారు జవాబు ఇవ్వకపోవడంతో చివరకు టీఎస్‌ఆర్టీసీ పేరుమీద నోటీసులు ఇచ్చాం. ప్రస్తుతం ఆర్టీసీ వారు నగదు కడితేనే ఆన్‌లైన్‌లో అసెస్‌మెంట్ నెంబరు అలాట్ అవుతుంది. ఐటీ హబ్‌కు కూడా అదే రకమైన పరిస్థితి ఉంది. స్థలం ఎవరిదో తేలని పరిస్థితి ఉంది. అందుకే వారికి ఎలాంటి నోటీసులు ఇవ్వలేదు.

ఎన్‌కౌంటర్‌లో ముగ్గురు మావోయిస్టుల మృతి

చర్ల, సెప్టెంబరు 23: ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం నారాయణపూర్ జిల్లా అబూజ్‌మడ్ అడవుల్లో సోమవారం సాయంత్రం మావోయిస్టులు, పోలీసులు మధ్య జరిగిన ఎన్‌కౌంటర్‌లో ముగ్గురు మావోయిస్టులు మృతి చెందారు. మావోయిస్టుల కదలికల నేపథ్యంలో పోలీసులు కూంబింగ్ చేపట్టారు. అబూజ్‌మడ్ అడవుల్లో మావోయిస్టులు పోలీసులు మధ్య ఎదురుకాల్పులు జరిగాయి. ఘటనలో ముగ్గురు మావోయిస్టులు మృతి చెందగా వారిలో ఒకరు మహిళ ఉన్నారు. ఘటనా స్థలం నుంచి అధునాతన తుపాకులను పోలీసు బలగాలు స్వాధీనం చేసుకున్నాయి. మావోయిస్టుల మృతదేహాలను నారాయణపూర్ జిల్లా కేంద్రానికి తరలిస్తున్నారు. మృతులను గుర్తించాల్సి ఉంది. ఇదిలా ఉండగా ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం బీజాపూర్ జిల్లాలో ఎనిమిది మంది మావోయిస్టులు పోలీసుల ఎదుట లొగిపోయారు. వీరిపై సుమారు రూ.28లక్షల రివార్డు ఉన్నట్లు తెలుస్తోంది.

పెసల కొనుకోలు కేంద్రం వద్ద ఆందోళన

- గేట్ల వద్ద రైతుల ధర్నా

ఖమ్మం మార్కెట్ , సెప్టెంబరు 23: నగరంలోని వ్యవసాయ మార్కెట్లోని మార్క్‌ఫెడ్ పెసల కొనుగోలు కేంద్రం వద్ద సోమవారం పెసర రైతులు ఆందోళన నిర్వహించారు. గోదాముల వద్ద కొనుగోలు చేసిన పెసలు లారీలు దిగుమతి ఆలస్యమవుతున్న డీసీఎంస్ సిబ్బంది కొనుగోళ్లను నిలిపివేశారు. దీంతో అప్పటికే కొనుగోలు కేంద్రానికి పెసలను అమ్మకానికి తీసుకువచ్చిన రైతులు చాలా సేపు వేచి చూశారు. కొనుగోలు సిబ్బంది ఎంతసేపైనా రాకపోవడంతో వారు ఆగ్రహించి తమ పెసలను కొనుగోలు చేయాలని డిమాండ్ చేస్తూ గేట్లు మూసి ధర్నా నిర్వహించారు. మార్క్‌ఫెడ్, డీసీఎంఎస్ సిబ్బంది తీరును నిరసిస్తూ పెద్ద ఎత్తున అరుస్తూ ఆందోళన నిర్వహించారు. సుమారు గంట పాటు జరిగిన ఆందోళనతో అధికారులు అక్కడికి చేరుకొని రైతులను సముదాయించే ప్రయత్నాలు చేశారు. పెసర రైతులు తమ పట్టాదార్ పాస్‌బుక్, బ్యాంక్ డిటైల్స్, ట్యాప్ ఎంట్రీ తదితర వివరాలు ఇవ్వక పోతే డబ్బులు రావని అందుకనే ఆలస్యం అవుతుందని చెప్పే ప్రయత్నం చేసినా రైతులు వినలేదు. ఒక్కసారిగా రైతులు పెద్దగా నినాదాలు చేస్తూ కాంటాలను ధ్వంసం చేసే ప్రయత్నాలు చేశారు. కాగా మార్కెట్ అధికారులు కలగచేసుకొని మార్క్‌ఫెడ్, డీసీఎంఎస్ సిబ్బందికి నచ్చచెప్పడంతో కొంత మేర పంట కొనుగోలు చేసి చేతులు దులుపుకొన్నారు. దీంతో రైతులు ఆగ్రహంతో వెనుదిరిగారు.

అండర్ టన్నెల్‌కు చెక్

(5వ పేజీ తరువాయి)

కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా జరుగుతున్న పనులపై ఇరిగేషన్ సీఈ విద్యాసాగర్‌ను అడిగి తెలుసుకున్నారు. పనుల్లో నిర్లక్ష్యంపై మంత్రి ఫైర్ అయ్యారు. సకాలంలో సాగునీరు అందకపోవడంతో ఆయకట్టులో పంటలు ఎండిపోతున్నాయని తెలిపారు. వెంటనే పనులు పూర్తిచేసి మంగళవారం నాటికి నీరు విడుదల చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా సాగునీరు అందకపోవడానికి కారకులైన అధికారులపై నివేదిక ఇవ్వాలని కలెక్టర్‌ను ఆదేశించారు.


కార్యక్రమంలో సీఈ విద్యాసాగర్, ఈఈ అనన్య, డీఈ మధు, పలువురు కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

పనులు వేగంగా పూర్తి చేయాలి

పాలేరు ఎడమ కాల్వ పునరుద్ధరణ పనులను నిరంతరాయంగా, యుద్ధ ప్రాతిపదికన చేసి పూర్తి చేయాలని రాష్ట్ర రెవెన్యూ, హౌజింగ్, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అధికారులను ఆదేశించారు.

సోమవారం రాత్రి మంత్రి పాలేరు ఎడమ కాల్వ పునరుద్ధరణ పనులను ఆకస్మికంగా తనిఖీ చేశారు. పనులు చేసే ప్రాంతంలో లైటింగ్ సరిపడేంత లేకపోవడం గమనించిన మంత్రి లైట్లు ఏర్పాటు చేసి పనులు నిరంతరాయంగా చేసి పూర్తి చేయాలని ఆదేశించారు. పనులు ఆశించిన మేరకు పురోగతిలో లేకపోవడంతో అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు.

పూర్తి సామర్థ్యం మేరకు పనులు నిర్వహించి కాల్వ పునరుద్ధరణ చేసి రైతులకు సాగునీరు అందించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. పనుల పరిశీలన కార్యక్రమంలో మంత్రి వెంట ఇరిగేషన్ అభివృద్ధి సంస్థ చైర్మన్ మువ్వా విజయ్‌బాబు, సీఈ విద్యాసాగర్, ఎస్ఈ నర్సింగ్‌రావు, అధికారులు, తదితరులు ఉన్నారు.

ANDHRAJYOTHY
ఆంధ్రజ్యోతి

భద్రాద్రి
కొత్తగూడెం
కొత్తగూడెం, ఇల్లెందు, భద్రాచలం, పినపాక, అశ్వారావుపేట
8
మంగళవారం 24 సెప్టెంబరు 2024

కానిస్టేబుల్ భిక్షమయ్య సేవలు భేష్ : డీఎస్పీ రెహమాన్

కొత్తగూడెం పోస్టాఫీస్ సెంటర్, సెప్టెంబరు23: కొత్తగూడెం త్రీ టౌన్ కానిస్టేబుల్ బిక్షమయ్య సేవలు భేష్ అని డీఎస్పీ అబ్దుల్ రెహమాన్ కొనియాడారు. సోమవారం డీఎస్పీ కార్యాలయంలో బిక్షమయ్యను శాలువతో సన్మానించి సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఇటీవల హైదారాబాద్‌లో జరిగిన వినాయక చవితి నిమజ్జనంలో గుర్తు తెలియని వ్యక్తి పెద్ద కత్తితో ప్రజలను భయభ్రాంతులకు గురి చేశాడు. అక్కడే విధుల్లో ఉన్న బిక్షమయ్య ధైర్యంగా ముందుకు వచ్చి ఆ కత్తిని తీసుకొని , అతడిని అదుపులో తీసుకున్నాడు. దీంతో ప్రమాదం తప్పింది. శ్రద్ధతో తన విధి కర్తవ్యాన్ని నిర్వహించి పోలీస్ శాఖకు మంచి పేరు తీసుకురావడం చాలా సంతోషంగా ఉందన్నారు. భవిష్యత్తులో బిక్షమయ్య నిబద్ధతతో పని చేస్తూ ఉన్నత స్థాయికి చేరుకోవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో త్రీటౌన్ సీఐ శివప్రసాద్, టూటౌన్ సీఐ రమేష్, ఎస్ఐ రామలింగారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

శిక్షణ అనేది ప్రతి ఉద్యోగికి తప్పని సరి

● జీఎం సెక్యూరిటీ శ్రీనివాసరావు

కొత్తగూడెం, సెప్టెంబరు23 (ఆంధ్రజ్యోతి): శిక్షణ అనేది ప్రతి ఉద్యోగికి తప్పని సరి అని జనరల్ మేనేజర్ (సెక్యూరిటి) కే. శ్రీనివాసరావు అన్నారు. సోమవారం ఎస్అండ్‌పీసీ ట్రైనింగ్ సెంటరులో 32వ బ్యాచ్ ఫస్ట్ ఎయిడ్, ఫైర్‌ఫైటింగ్ శిక్షణ తరగతులను ప్రారంభించి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ట్రైనింగ్ ఇన్‌స్పెక్టర్ కే. సత్యనారాయణ, ట్రైనింగ్ అధికారి ఎండి. జాకీర్ హుస్సేన్, కార్పోరేట్ జమేదార్లు, తదితరులు పాల్గొన్నారు.

శ్రీవారి ప్రసాదాన్ని అపవిత్రం చేసిన వారిని శిక్షించాలి

జూలూరుపాడు, సెప్టెంబరు23: తిరుమల తిరుపతి లడ్డూను కల్తీ చేయడం అత్యంత గర్హణీయమని టీడీపీ జిల్లా నాయకులు తాళ్లూరి అప్పారావు, ఆరెం రామయ్యలు అన్నారు. సోమవారం జూలూరుపాడులో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో వారు మాట్లాడారు. ఈ సమావేశంలో టీడీపీ నాయకులు తుమ్మలపల్లి వెంకటేశ్వర్లు, వడ్డె వెంకటనారాయణ, రోకటి నరసింహారావు, పెంటికల వీరబాబు, సురేష్, రమేష్, తదితరులు పాల్గొన్నారు.

విశ్వామిత్ర చౌహాన్‌ను సన్మానించిన వనజీవి రామయ్య

చుంచుపల్లి, సెప్టెంబరు23: కాళోజీ తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్ సంస్థ ద్వారా ఇటీవల నంది అవార్డు అందుకున్న చిన్నారి విశ్వామిత్ర చౌహాన్‌ను పద్మశ్రీ వన జీవి రామయ్య దంపతులు తమ నివాసం ఖమ్మంలో శాలువతో సోమవారం ఘనంగా సన్మానించారు. వృక్షో రక్షతి రక్షతః అనే నినాదం కలిగిన పద్మశ్రీ వనజీవి రామయ్య స్వయంగా తయారు చేసిన చక్రాన్ని ఇదే తాను ఇచ్చే పర్యావరణ అవార్డుగా భావించాలని అందజేశారు. అనంతరం చిన్నారితో కలిసి నారింజ మొక్కను నాటారు.

కార్మికులు యాంత్రీకరణకు ప్రాముఖ్యత ఇవ్వాలి

అశ్వారావుపేట, సెప్టెంబరు23: మారుతున్న కాలానికి అనుగుణంగా కొబ్బరి కాయలను దింపే కార్మికులు యాంత్రీకరణ పద్ధతులకు ప్రాధాన్యత ఇవ్వాలని, వాటిపై అవగాహన కల్పించుకోవాలని అశ్వారావుపేట వ్యవసాయ సహాయ సంచాలకులు రవికుమార్ అన్నారు. సోమవారం వ్యవసాయ కళాశాలలో కొబ్బరి అభివృద్ధి బోర్డు, విజయవాడ సౌజన్యంతో ఏర్పాటు చేసిన కొబ్బరి వృక్ష మిత్రులకు నిర్వహించిన శిక్షణా కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. కార్యక్రమంలో కళాశాల అసోసియేట్ డీన్ డా. హేమంత్‌కుమార్, ఏవో శివ ప్రసాద్, డాక్టర్లు శిరీష, శ్రవణ్, రఘు, శ్రీను, శ్రీనివాసరెడ్డి, గోపాలకృష్ణ, రమేష్ పాల్గొన్నారు.

రేషన్ డీలర్లకు గౌరవ వేతనం అమలు చేయాలి

టేకులపల్లి, సెప్టెంబరు 23: కాంగ్రెస్ పార్టీ ఎన్నికల్లో ప్రకటించిన విధంగా రేషన్ డీలర్లకు రూ.5వేలు గౌరవ వేతనం అమలు చేయాలని కోరుతూ భద్రాది కొత్తగూడెం జిల్లా రేషన్ డీలర్ల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో సోమవారం ఇల్లెందులో ఎంపీ బలరాం నాయక్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ విషయాన్ని సీఎం రేవంత్‌రెడ్డి, పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి దృషికి తీసుకెళ్లుతానని ఎంపీ వారికి తెలిపారు. వినతి పత్రం అందచే సిన వారిలో రేషన్ డీలర్ల సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు వూకె శేఖర్‌రావు, ప్రధాన కార్య దర్శి దేవ్‌సింగ్, ఉపాధ్యక్షుడు రామా, కోశాధికారి బాలు, సంతులాల్, చందర్, వెంకన్న, హేమచందర్, కళ్యాణ్, బాలు, హన్మకొండ జిల్లా అధ్యక్షుడు మోహన్ నాయక్ ఉన్నారు.

కేకే ఫౌండేషన్ సేవలు అభినందనీయం: సీఐ

అశ్వాపురం, సెప్టెంబరు 23: కేకే ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సామాజిక కార్యక్రమాలు అభినందనీయమని అశ్వాపురం సీఐ అశోకొరెడ్డి అన్నారు. సోమవారం అశ్వాపురానికి చెందిన కేకే ఫౌండేషన్ చైర్మన్ కొర్లకుంట కిషోర్ ఆధ్వర్యంలో అశ్వాపురం గ్రామపంచాయతీకి చెందిన పారిశుధ్య కార్మికులకు రెయిన్ కోట్లు అందజేశారు. కార్యక్రమంలో ఎంపీడీవో వరప్రసాద్, ఎంపీఈవో ముత్యాలరావు, ఏపీవో సీతారాములు, కార్యదర్శి మల్లేషం, వరలక్ష్మి, కన్‌స్ట్రక్షన్ డైరెక్టర్లు వేములపల్లి కృష్ణార్జున్, రమేష్, కెకె ఫౌండేషన్ అధ్య, కార్యదర్శులు మల్లెబోయిన నాగేశ్వరరావు, గద్దల నాగేశ్వరరావు, నయూం, కృష్ణ తదితరులున్నారు.

సింగరేణి వల్లే వరద ముంపు...

● జీఎం కార్యాలయం వద్ద మహిళల ధర్నా


పట్టణంలో ప్రదర్శన నిర్వహిస్తున్న మహిళలు

మణుగూరు, సెప్టెంబరు23: సింగరేణి కాలరీస్ కంపెనీకి చెందిన ఓబీ కుప్పల నుంచి వచ్చే వరద మణుగూరులో ప్రళయాన్ని సృష్టించి ఇండ్లను ముంచేశాయని ఇంతటి విపత్తుకు సింగరేణి కారణమంటూ మణుగూరు మునిసిపాలిటీ పరిధిలోని సుందరయ్య నగర్‌తో పాటు పరిసర ప్రాంతాల వాసులు సోమవారం ఆందోళన చేపట్టారు. వందల సంఖ్యలో మహిళలు కలసి భారీ ప్రదర్శన నిర్వహించారు. సింగరేణి ఉన్నతాదికారులు ఈ విషయంపై తక్షణమే స్పందించి తగిన చర్యలను చేపట్టాలని సింగరేణి నీటిని ప్రత్యేకంగా దారి మళ్లించి పట్టణ పరిసర ప్రాంతాల వైపునకు రాకుండా చర్యలను చేపట్టాలని పేర్కొన్నారు. అలాగే తమకు జరిగిన నష్టానికి సింగరేణి నష్టపరిహారం చెల్లించాలని కూడా డిమాండ్ చేశారు.

'ప్రతి ఒక్కరూ చెట్లను నాటాలి'

దుమ్ముగూడెం, సెప్టెంబరు 23: పర్యావరణ పరిరక్షణ దిశగా ప్రతీ ఒక్కరూ విధిగా చెట్లను నాటి పెంచాలని సీఆర్‌పీఎఫ్ 141 బెటాలియన్ అసిస్టెంట్ కమాండెంట్ రేవతి అర్జునన్ అన్నారు. సోమవారం లక్ష్మీనగరం మడోనా, కిడ్స్ ప్రైవేట్ పాఠశాలల్లో మొక్కలను నాటి మాట్లాడారు. మానవాళి మనుగడకు పచ్చటి చెట్ల మనుగడ ఎంతో అవసరమన్నారు. ఎస్ఐ దేవన్న, ఏఎస్ఐ భాస్కరరావు, ప్రిన్సిపాల్స్, విద్యార్థులు పాల్గొన్నారు.

మృతుల కుటుంబాలను పరామర్శించిన రేగా

దుమ్ముగూడెం సెప్టెంబరు 23: భార్యను కోల్పోయిన ఆదివాసీ నాయకుడు సోందె మల్లు, అన్న సీతయ్యను కోల్పోయిన బీఆర్ఎస్ నాయకుడు జోగా బుజ్జిలను బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు రేగా కాంతారావు సోమవారం పరామర్శించారు, ఆయా గ్రామాల్లో వారి భౌతికకాయాల్ని సందర్శించి నివాళులర్పించారు. మండల అధ్యక్షుడు అన్నె సత్యనారాయణమూర్తి, మాజీ ఎంపీపీ లక్ష్మి, ఉపాధ్యక్షులు కామేశ్వరావు, కణితి రాముడు, జానీపాషా, శ్రీనివాస్, శ్రీకాంత్, నరేంద్ర తదితరులు పాల్గొన్నారు.

నూతన లేబర్ కోడ్‌లను రద్దు చేయాలి: కార్మికులు

బూర్గంపాడు/ అశ్వారావుపేట టౌన్/ మణుగూరు టౌన్/ మణుగూరు/ ఇల్లెందుటౌన్, సెప్టెంబరు 23: కార్మిక లేబర్ కోడ్‌లను కేంద్ర ప్రభుత్వం కార్మికులపై బలవంతంగా రుద్దాలని చూస్తుందని పలువురు నాయకులు ఆరోపించారు. సోమవారం కేంద్ర ప్రభుత్వం తీసుకవస్తున్న నాలుగు కార్మిక లేబర్ కోడ్లను ఉపహసంహరించుకోవాలని డిమాండ్ చేస్తూ దేశ వ్యాప్త సమ్మెలో భాగంగా ఆయా మండలాల్లో కార్మికులు నిరసనలు, ఆందోళనలు చేపట్టారు. ఆయా కార్యక్రమాల్లో పలువురు నాయకులు, వివిధ సంఘాల కార్మికులు, పాల్గొన్నారు.

ముత్యాలమ్మ ఆలయ హుండీ లెక్కింపు

అశ్వారావుపేట రూరల్, సెప్టెంబరు 23: మండలంలోని వినాయకపురంలో గల చిలకలగండి ముత్యాలమ్మ ఆలయ హుండీని సోమవారం ఆలయ అధికారులు లెక్కించారు. జూన్ 6వ తేదీ నుంచి సోమవారం వరకు వచ్చిన ఆదాయాన్ని లెక్కించగా రూ.78,958 ఆదాయం వచ్చింది. కార్యక్రమంలో కార్యనిర్వహణాధికారి సూర్యప్రకాశరావు, గ్రామపెద్దలు నల్లపు నరసింహారావు, నరాల శ్రీను, జక్కుల జగదీశ్, నారం జగదీశ్ పాల్గొన్నారు.

కమ్యూనిటీ స్థలాన్ని ఆక్రమించిన వారిపై చర్యలు తీసుకోవాలి

దమ్మపేట , సెప్టెంబరు2: ఆదివాసి కమ్యూనిటీ భవన నిర్మాణానికి కేటాయించిన స్థలాన్ని కొందరు ఆక్రమించుకొనేందుకు ప్రయత్నిస్తున్నారని ఆదివాసి నాయకులు ఆరోపిస్తూ వారిపై చర్యలు తీసుకోవాలని డిప్యూటీ తహసీల్దార్, ఎస్ఐలకు సోమవారం వినతి ప్రతం అందజేశారు. ఈకార్యక్రమంలో జేఏసీ, ఆదివాసీ నాయుకులు కొర్సా వెంకటేష్, బండారు సూర్యనారాయణ, కట్టం ఎర్రప్ప, కారం శ్రీరాములు, గడ్డం వెంకటేశ్వర్లు, తంబళ్ళ రవి, సోయం రామూర్తి, దుర్గమ్మ, సారలమ్మ, నాగమణి, స్వాతి, పుష్ప తదితరులున్నారు.

వడ్డే ఓబన్న జయంతిని అధికారికంగా నిర్వహించాలి

భద్రాచలం, సెప్టెంబరు 23: వడ్డే ఓబన్న జయంతిని ప్రభుత్వం అధికారికంగా నిర్వహించాలని కోరుతూ భద్రాచలం ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావును కలిసి వడ్డెర సంఘం నాయకులు సోమవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వడ్డెర సంఘం జిల్లా అధ్యక్షుడు తురక లక్ష్మయ్య మాట్లాడుతూ వడ్డెర సోదరుల ఆణిముత్యం వడ్డే ఓబన్న విగ్రహాన్ని త్వరలో ఏర్పాటు చేస్తున్నామని, దానికి పూర్తి సహకారం అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో గుంజ బాబు, గుంజా ఏడుకొండలు, పల్లెపు శ్రీను, శివ పాల్గొన్నారు.

అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి

అశ్వాపురం, సెప్టెంబరు 23: మండల పరిధిలోని అమెర్దా సీతారామా కెనాల్‌లో పడి అనుమానాస్పదస్థితిలో ఓవ్యక్తి మృతి చెందిన సంఘటన సోమవారం రాత్రి వెలుగు చూసింది. సంఘటనకు సంబంధించిన వివరాలిలా ఉన్నాయి. అమెర్దా ఎస్సీ కాలనీకి చెందిన యాస నవీన్(36) రెండు రోజుల క్రితం ఇంటి నుంచి బయటకు వెళ్లాడు. కాగా కొన్నేళ్లుగా భార్యా భర్తల మధ్య వివాదాలు చోటుచేసుకుంటున్నాయి. ఈనేపథ్యంలో భార్య పుట్టింటికి వెళ్లగా, అతడు ఒంటరిగా ఉంటున్నాడు. దీంతో మనస్తాపానికి గురై ఆత్మహత్యకు పాల్పడ్డాడా, లేక ప్రమాదవశాత్తూ కెనాల్‌లో పడిపోయాడా అన్న విషయం తెలియరావడం లేదు. కాగా ఈవిషయమై ఎటువంటి ఫిర్యాదు అందలేదని పోలీసులు తెలిపారు.

విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు

● మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి


సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి

ఇల్లెందు. సెప్టెంబరు23: విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తీసుకుంటామని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. సోమవారం ఇల్లెందులో నిర్వహించిన నియోజకవర్గ అధికారుల సమీక్ష సమావేశంలో మంత్రి అధికారులకు ముచ్చెమటలు పట్టించారు. 'అసలు నువ్వు ఈఈవేనా..? ప్రపోజల్ వర్కు క్యాన్సిల్ చేస్తానంటారేమిటి..? నువ్వు ఈఈగా పనికి రావు...' అంటూ మంత్రి పొంగులేటి పంచాయతీరాజ్ అధికారిపై ఫైర్ అయ్యారు. మూడు నెలలుగా బర్లగుడెంలో టీచర్ ను ఏర్పాటు చేయమని స్థానిక ఎమ్మెల్యే కోరం కనకయ్య చెప్పినా పట్టించుకోరా..? అని విద్యాశాఖ అధికారిపై కన్నెర్ర చేశారు. జిల్లాలోని వివిధ శాఖలలో మంజూరైన వివిధ దశలలో ఉన్న అభివృద్ధి పనులపై అధికారులను అడిగి వివరాలు తెలుసుకున్నారు. ఈ మధ్య కురిసిన భారీ వర్షాల కారణంగా దెబ్బ తిన్న రోడ్ల, సీసీ రోడ్లు మరమ్మతులు పనులు ఎంతవరకు పూర్తి అయ్యాయని అధికారుల ద్వారా తెలుసుకున్నారు.

పట్టణాల్లో గ్రామాలలో విద్యుత్ సరఫరా ఆటంకం కలుగకుండా సరఫరా చేయాలని, గ్రామాలలో వదులుగా ఉన్న విద్యుత్ తీగలను సరిచేయాలన్నారు. అమ్మ ఆదర్శ పాఠశాల పనులు పూర్తి చేయాలని, ప్రతీ ఇంటికి మిషన్ భగిరథ మంచి నీరు అందజేయాలన్నారు. పాఠశాలల్లో విద్యార్థులకు అనుగుణంగా ఉపాధ్యాయుల కేటాయింపునకు విద్యాశాఖ అధికారులు చర్యలు తీసుకోవాలని సూచించారు. రాష్ట్ర ప్రభుత్వం వైద్య, విద్యా వ్యవస్థలపై ప్రత్యేక దృష్టి సారించిందని, అందుకనుగుణంగా అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించకుండా పని చేయాలన్నారు. జిల్లాలో ఆక్రమణకు గురి అయిన ప్రభుత్వ భూములు స్థలాల విషయంలో ఎంత పెద్ద వారి నైనా ఉపేక్షించకుండా పోలీసు వారి సహకారంతో ఒక్క గజం కూడా వదలకుండా రాబట్టేలా చర్యలు చేపట్టాలని అన్నారు. మహిళల ఆర్థిక చేయూతకు మహిళాశక్తి ద్వారా యూనిట్ల లబ్ధిదారుల ఎంపిక పూర్తి చేసి వారి ఆర్థిక అభ్యున్నతికి తోడ్పాటు నందించాలని సూచించారు. ఇల్లందు మునిసిపల్ చైర్మన్ దమ్మల పాటి వెంకటేశ్వరరావు ఇల్లందులో జీ వో నెంబర్ 76 లబ్దిదారుల గోడు వివరించారు. 18 వందలమంది పట్టాల కోసం డబ్బులు చెల్లించి ఎదురు చూస్తున్నారని వెల్లడించడంతో స్పందించిన మంత్రి పొంగులేటి పరిశీలించి పరిష్కరించాలని కలెక్టర్‌ను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో పలువురు నాయకులు అధికారులు పాల్గొన్నారు.

స్థానిక సంస్థల ఎన్నికల పోటీల్లో ఉంటాం: టీడీపీ


సమావేశంలో మాట్లాడుతున్న రామచంద్రయ్య

బూర్గంపాడు, సెప్టెంబరు 23: జరగనున్న స్థానిక ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ అన్ని నియోజకవర్గాలలో పోటీలో ఉంటుందని టీడీపీ మహబూబాబాద్ పార్లమెంటు మాజీ అధ్యక్షుడు కొడపల్లి రామచంద్రయ్య తెలిపారు. సోమవారం బూర్గంపాడు మండల పరిధిలోని సారపాకలో మండల అధ్యక్షుడు తాళ్లూరి జగదీశ్వరరావు నివాసంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎన్నికల్లో పోటీలో ఉంటామని...రాష్ట్రంలో తెలుగుదేశం పార్టీ అడ్‌హక్ కమిటీ ఏర్పాటు జరగబోతుందని తెలిపారు. ఈ సమావేశంలో నాయకులు పోటు రంగారావు, వాసిరెడ్డి చలపతిరావు, వట్టం నారాయణదొర, యార్లగడ్డ రాజా, తోట వెంకటేశ్వర్లు, సిరిసెట్టి కమలాకర్, కాకర్ల సత్యనారయణ, సుబ్బారావు, వెంకటనారయణ, హరికిషన్, శ్రీహరి పాల్గొన్నారు.

ప్రభుత్వ వైద్యం పట్ల విశ్వాసం పెంచాలి

ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు


ఆటల పోటీలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు

బూర్గంపాడు, సెప్టెంబరు 23: ప్రభుత్వ వైద్యం పట్ల విశ్వాసం పెంచాలని ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు అన్నారు. సోమవారం బూర్గంపాడు ప్రభుత్వ ఆసుపత్రిని తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడారు. అనంతరం జోనల్ స్థాయి ఆటల పోటీలను ప్రారంభించారు. అనంతరం ఇరవెండి, మోతె గ్రామాలలో పలు అభివృద్ధి పనులను చేపట్టారు. కార్యక్రమంలో తహసీల్దార్ ముజాహిద్, ఎంపీడీవో జమలారెడ్డి, ఎంఈవో సమ్మయ్య, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు, జోనల్ స్థాయి కన్వీనర్ రవిలాదేవి, ఎస్‌జీఎఫ్ సెక్రటరీ నరేష్, జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ చిన్నా, మాజీ ఎంపీపీ కైపు రోశిరెడ్డి, సోసైటీ మాజీ చైర్మన్ పోతిరెడ్డి వెంకటేశ్వర్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు దుగ్గెంపూడి కృష్ణారెడ్డి, సతీష్, నాగరాజు, ప్రసాద్, సేవాలాల్, నాగమణి, వెంకటేశ్వర్‌రెడ్డి, బలరాం, శ్రీనివాసరెడ్డి, సాంబ, మహేష్, కిషోర్, రమేష్, రాజు, సారధి, తదితరులు పాల్గొన్నారు.

భక్తులు ఆందోళన చెందొద్దు

బూర్గంపాడు, సెప్టెంబరు 23: మండల పరిధిలో గోదావరి ద్వీపకల్పంలో ఉన్న మోతెగడ్డ వీరభద్ర స్వామి వారి ఆలయాన్ని సోమవారం ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు సందర్శించారు. ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. భక్తులు ఆందోళన చెందవద్దని ఆలయానికి ఎటువంటి ప్రమాదం లేదని సూచించారు. ముఖ్యమంత్రి దృష్టికి తీసుకువెళ్లి త్వరలోనే పునరుద్దరణ చర్యలు చేపట్టి ఆలయాన్ని యథాస్థితికి తీసుకవస్తాని హామీ ఇచ్చారు.

క్రీడలతో మానసికోల్లాసం

ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు


క్రీడాకారులను సన్మానిస్తున్న ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు

పాల్వంచ టౌన్, సెప్టెంబరు23: విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో రాణించాలని కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అన్నారు. సోమవారం పాల్వంచ శ్రీనివాసకాలనీలోని క్రీడా మైదానంలో టెన్నిస్ జిల్లా స్థాయి పోటీల ముగింపు కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. ఈ కార్యక్రమంలో జిల్లా టెన్నిస్ అసోసియేషన్ అధ్యక్షుడు డాక్టర్ యుగంధరెడ్డి, సీపీఐ పట్టణ కార్యదర్శి అడుసుమిల్లి సాయిబాబు, సీనియర్ క్రీడాకారుడు వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

చదువును నిర్లక్ష్యం చేయొద్దు

చుంచుపల్లి: చదువును నిర్లక్ష్యం చేయొద్దని ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు సూచించారు. సోమవారం రుద్రంపూర్ జడ్పీహెచ్ఎస్‌లో కొత్తగూడెం జోనల్ లెవల్ క్రీడల పోటీలను ప్రారంభించి మాట్లాడారు. సుమారు 440మంది క్రీడాకారులు ఈ జోనల్ స్థాయి పోటీల్లో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో డీఎస్పీ అబ్దుల్ రెహమాన్, తహసీల్దార్ కృష్ణ, ఎంఈవో జుంకీలాల్, పాఠశాల సెక్రటరీ సుజాత, ప్రధానోపాధ్యాయులు బాలాజీ, ఎస్‌జీఎఫ్ సెక్రటరీ వాసిరెడ్డి నరేష్‌కుమార్ పాల్గొన్నారు.

జాతీయ స్థాయిలో పతకాలు సాధించిన ఏ.వందన, సిహెచ్.వేదశ్రీ, జె.దీక్షిత్‌లను అభినందించారు. అదేవిధంగా కొత్తగూడెం అథ్లెటిక్స్ కోచ్‌లు దుంపల మల్లిఖార్జునరావు, సుష్మబాయ్, జాతీయ క్రీడాకారులు వంశీ, మాన్వితలను అభినందించారు.

పథకాలు అందించేందుకు కృషి

ఎమ్మెల్యే జారే ఆదినారాయణ


సీఎంఆర్ఎఫ్ చెక్కులు అందజేస్తున్న ఎమ్మెల్యే జారే ఆదినారాయణ.

అన్నపురెడ్డిపల్లి, సెప్టెంబరు 23: అధికారులతో సమన్వయం చేసుకుంటూ అర్హులందరికీ ప్రభుత్వ పథకాలు అందే విధంగా కృషి చేస్తున్నామని అశ్వారావుపేట ఎమ్మెల్యే జారే ఆదినారాయణ తెలిపారు. సోమవారం అన్నపురెడ్డిపల్లిలో పలువురు లబ్ధిదారులకు సీఎంఆర్ఎఫ్, కళ్యాణలక్ష్మి చెక్కులను ఎమ్మెల్యే అందచేశారు. అనంతరం రెసిడెన్షియల్ జూనియర్ కళాశాలను ఎమ్మెల్యే సందర్శించి బోధనా విధానాన్ని పరిశీలించారు. ఈ సంర్భంగా విద్యార్థులతో మాట్లాడుతూ దీక్ష పట్టుదలతో చదివి అత్యున్నత స్థాయికి చేరుకోవాలని కోరారు. కళాశాలకు ఫర్నిచర్‌తో పాటు డిజిటల్ క్లాసుల నిర్వహించేందకు కృషి చేస్తానని హామి ఇచ్చారు. ఈ కార్యక్రమంలో అధికారులతో పాటు స్థానిక సీనియర్ కాంగ్రెస్ నాయకుడు పరస వెంకట్ తదితరులు పాల్గొన్నారు.

దమ్మపేట: మల్కారం, రాసూరుపల్లి గ్రామ పంచాయతీల పరిధిలో మహిళా కాంగ్రెస్ ఆధ్వర్యంలో చేపడుతున్న సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని సోమవారం ఎమ్మెల్యే జారే ఆదినారాయణ పరిశీలించారు. పెద్ద గొల్లగూడెం, .రాచూరిపల్లి గ్రామాల్లో మారుతి వీరబాబు, పాస్టర్ సోయం జాన్ కుటుంబాలను పరామర్శించారు. అంకంపాలెంలో అనారోగ్యానికి గురైన కోండ్రు శావణ్‌ను ఆయన పరామర్శించారు. కార్యక్రమంలో మండల మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు ఏసుమణి, రాజ్యలక్ష్మి, రమణ తదితరులున్నారు.

నాలుగోసారి మోసగించేందుకే జమిలి

● మాజీ ఎంపీ బాబురావు

భద్రాచలం, సెప్టెంబరు 23: గత ఎన్నికల్లో మతం పేరుతో రాజకీయ లబ్ధిపొందిన మోదీ భవిష్యతులో జరిగే ఎన్నికల్లో జమిలీ పేరుతో మరోసారి ప్రజలను మోసం చేసేందుకు సిద్ధమవుతున్నారని మాజీ పార్లమెంటు సభ్యుడు మిడియం బాబురావు అన్నారు. భద్రాచలంలో సోమవారం నిర్వహించిన సీపీఎం శాఖ మహాసభలో ఆయన పాల్గొని మాట్లాడారు. రానున్న గ్రామ పంచాయతీ ఎన్నికల్లో భద్రాచలంను ఒకే పంచాయతీగా గుర్తించి ఎన్నికలు నిర్వహించాలని తద్వారా భద్రాచలంఅభివృద్ధి సాధ్యమవుతుందన్నారు. ఈ కార్యక్రమంలో సంతోష్‌కుమార్, లీలావతి, డి.సీతాలక్ష్మి, జీవనజ్యోతి, రాయల రాములు, కాపుల రవి, అప్పాయమ్మ, నిర్మల తదితరులు పాల్గొన్నారు.

వైద్యశిబిరం ఏర్పాటు అభినందనీయం

● డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ సుకృత

పాల్వంచ టౌన్, సెప్టెంబరు 23: నవభారత్ యాజమాన్యం విద్యార్థులకు వైద్యశిబిరం ఏర్పాటు చేయడం అభినందనీయమని డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ సుకృత అన్నారు. సోమవారం నవలిమిటెడ్ ఆధ్వర్యంలో పాల్వంచ ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు సీఎస్ఆర్ పాలసీ కింద పాత పాల్వంచ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నందు రోహిణీ ఫౌండేషన్ హైదరాబాద్ వారి సహకారంతో విద్యార్థులకు దంత వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సంస్థ జనరల్ మేనేజర్ సీఎస్ఆర్ ఎంజీఎం ప్రసాద్, రోహిణీ ఫౌండేషన్ సభ్యులు డాక్టర్ అలేఖ్య జనరల్ మేనేజర్ సురేష్ చంద్ర, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఇంచార్జి హెచ్ఎం సత్యనారాయణరెడ్డి నవ మొబైల్ టీం సభ్యులు రాజేశ్వరరావు, రాజేష్, శ్రీకాంత్, శ్రీనివాసరావు, వెంకయ్య పాల్గొన్నారు.

కానిస్టేబుల్ కృష్ణకు ఆర్థిక సాయం

చుంచుపల్లి, సెప్టెంబరు23: చుంచుపల్లి పోలీస్ స్టేషన్‌లో కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్న కృష్ణ అనారోగ్యానికి గురై ఇబ్బందులు పడుతున్నాడు. కాగా 2009 కానిస్టేబుల్ బ్యాచ్‌కు చెందిన తోటి ఉద్యోగులు సోమవారం రూ.50 వేల నగదును ఆర్థిక సాయంగా ఆయన కుటుంబ సభ్యులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో బ్యాంచ్‌మేంట్లు రామారావు, అశోక్, చంద్రశేఖర్, జంపయ్య, మోహన్, బాగి రమేష్, లక్ష్మణ్, తదితరులు పాల్గొన్నారు.

క్రీడా దుస్తుల పంపిణీ

జూలూరుపాడు, సెప్టెంబరు23: జూలూరుపాడు ఉన్నత పాఠశాలలోని విద్యార్థులకు సోమవారం జూలూరుపాడు గ్రామానికి చెందిన జేఎన్‌టీయూ హైదరబాద్ అసోసియేట్ ప్రొఫెసర్‌గా పని చేస్తున్న మందా రంజిత్‌కుమార్ విద్యార్థులకు క్రీడా దుస్తులు వితరణగా అందచేశారు. క్రీడాదుస్తులను పాఠశాల ప్రధానోపాధ్యాయులు లక్ష్మి నర్సయ్య చేతుల మీదుగా విద్యార్థులకు అందచేశారు. దాతను ఉపాధ్యాయ సిబ్బంది అభినందించారు. ఈ కార్యక్రమంలో పనితి గోపాల కృష్ణ, బాబు, ఉపాధ్యాయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

జూడో ఉమ్మడి జిల్లా జట్టు ఎంపిక

చుంచుపల్లి, సెప్టెంబరు23: జూడో ఉమ్మడి ఖమ్మం జిల్లా జట్టు ఎంపిక జాబితాను భద్రాద్రి జిల్లా ఎస్‌జీఎఫ్ కార్యదర్శి నరేష్‌కుమార్ సోమవారం ప్రకటించారు. ఈ జట్టులో డి.గణేష(ముదిగొండ), ఎం.ప్రవీన్‌కుమార్(తిరుమలాయపాలెం), జి.హర్షవర్ధన్(సత్తుపల్లి), పి.ప్రశాంత్(అన్నపురెడ్డిపల్లి), బి.చరణ్‌తేజ్(దమ్మపేట), సీహెచ్ వర్ధని(పాల్వంచ), ఆర్.ఆశ్రిత(పాల్వంచ) ఉన్నారు.

'డాక్టర్ విజయేందర్‌రావు సేవలు వెలకట్టలేనివి'


విజయేందర్‌రావు చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే కూనంనేని, డాక్టర్లు

చుంచుపల్లి, సెప్టెంబరు23: రోటరీ క్లబ్ మాజీ గవర్నర్ డాక్టర్ విజయేందర్‌రావు సేవలు వెలకట్టలేనివని కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అన్నారు. సోమవారం కొత్తగూడెం ఐఎంఏ హాలులో నిర్వహించిన విజేందర్‌రావు సంస్మరణ సభలో నివాళులర్పించి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ బాలోత్సవ జాతీయ కన్వీనర్ డాక్టర్ వాసిరెడ్డి రమేష్‌బాబు, డాక్టర్ నాగరాజు, రోటరీ క్లబ్ ప్రతినిధి జె.అబ్రహం, ఐఎంఏ అధ్యక్షులు డాక్టర్ అరకల భాస్కరరావు, సెక్రటరీ అయ్యప్ప రాజశేఖర్, సభ్యులు ఉదయభాను, ఇరుకు బాబూరావు, పాషా, కుటుంబ సభ్యులు తమనం వెంకటేశ్వరరావు, వినయ్‌కుమార్, అమృతవర్ష, అమూల్యా దీప్తి, సాయి మధుకర్, మద్దెల శివకుమార్, మారపాక రమేష్, జేబీ శౌరీ, మండల సంజీవరావు, ఆంథోటీపాల్, గడ్డం రాజశేఖర్, సురేష్‌నాయక్, గోరంట్ల సుగుణరావు, తదితరులు పాల్గొన్నారు.

'పొట్టి శ్రీరాములు పేరును కొనసాగించాలి'

కొత్తగూడెం, సెప్టెంబరు23 (ఆంధ్రజ్యోతి): తెలుగు విశ్వ విద్యాలయానికి పొట్టి శ్రీ రాములు పేరు యదావిధంగా కొనసాగించాలని భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఆర్యవైశ్య మహాసభ ఆధ్వర్యంలో సోమవారం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు జిల్లా కలెక్టర్ కార్యాలయంలో వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా భద్రాద్రి జిల్లా ఆర్యవైశ్య మహాసభ అధ్యక్షుడు దారా రమేష్ మాట్లాడారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఆర్యవైశ్య మహాసభ కార్యవర్గసభ్యులు పెండ్యాల విజయబాస్కర్‌రావు, జిల్లా ప్రధానకార్యదర్శి ఎలుగూరి నగేష్‌కుమార్, కోశాధికారి సీమకుర్తి తాతా శ్రీనివాస్, వర్కింగ్ ప్రెసిడెంట్ దారా యుగంధర్, పెండ్యాల ప్రసాద్‌రావు, నగేష్, పల్లెర్ల చంద్రశేఖర్, పసుమర్తి రామభద్రం, ఉడత వెంకటేశ్వర్లు, తదితరులు పాల్గొన్నారు.

అశ్వారావుపేట: అమరజీవి పొట్టి శ్రీరాములు పేరును తెలుగు యూనివర్సిటీకి తొలగిస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకోవడం అన్యాయమని మండల ఆర్యవైశ్యసంఘ నాయకులు అన్నారు. కార్యక్రమంలో మండల ఆర్యవైశ్యసంఘం అధ్యక్షుడు ఎస్ శ్రీనివాసరావు, పట్టణ అధ్యక్షుడు జల్లిపల్లి లోక్‌నాద్ గుప్త, జల్లిపల్లి శ్రీరామమూర్తి, జిల్లా క్రీడ, విద్య కమిటీ చైర్మన్ కొణిజర్ల ఉమామహేశ్వరరావు, సుబ్బారావు, సంపూర్ణ, సత్యనారాయణ, పాల్గొన్నారు.

భద్రాచలం: పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం పేరు మార్చేందుకు రాష్ట్ర మంత్రివర్గం తీసుకున్న నిర్ణయం సమంజసమైన అంశం కాదని జిల్లా ఆర్యవైశ్య మహాసభ 2022- 23 జిల్లా అధ్యక్షుడు చారుగుళ్ల శ్రీనివాస్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పల్లెర్ల చంద్రశేఖర్, చింతల వినోద్‌కుమార్, ఉడతా నగేష్‌కుమార్, బండారు కృష్ణయ్య, పెనుగొండ సంతోష్, సముద్రాల అనిల్, తోకల నాగేశ్వరరావు పాల్గొన్నారు.

విద్యుత్ ఉద్యోగులు, ఆర్టిజన్లకు దసరా ఇన్సెంటివ్ ఇవ్వాలి

● హెచ్ -142 యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు రామారావు

పాల్వంచ, సెప్టెంబరు 23: రాష్ట్ర వ్యాప్తంగా వివిధ విద్యుత్ సంస్థల్లో పని చేస్తున్న విద్యుత్ ఉద్యోగులకు, ఆర్టిజన్లకు దసరా ఇన్సెంటివ్ ఇవ్వాలని హెచ్ -142 యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు కేవీ రామారావు డిమాండ్ చేశారు. సోమవారం పాల్వంచ కేటీపీఎస్ కాంప్లెక్స్‌లోని యూనియన్ ప్రాంతీయ కార్యాలయంలో కార్యకర్తల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. దసరా పండుగను పురస్కరించుకుని విద్యుత్ ఉద్యోగులకు, ఆర్టిజన్లకు 15 రోజుల ఇన్సెంటివ్‌ను, జూలై నుంచి రావాలసిన డీఏను ట్రాన్స్‌కో, జెన్కో యాజమాన్యాలు తక్షణమే విడుదల చేయాలన్నారు. విద్యుత్ సంస్థల్లో గతంలో దసరా పండుగకు 15 రోజుల ఇన్సెంటివ్‌ను ఇచ్చే ఆనవాయితీ ఉండేదని, కానీ గత యాజమాన్యం ఐదేళ్ల నుంచి ఇన్సెంటివ్‌ను నిలిపివేయడం బాధాకరమన్నారు.ఈ సమావేశంలో శ్రీనివాసచారి, సత్యరాజ్ స్టీవెన్, వెంపటి వెంకటేశ్వర్లు, షేక్ సయ్యద్ ఉన్నారు.

సీఎండీ బాధ్యతలు వేరే వారికి అప్పగించాలి

కొత్తగూడెం, సెప్టెంబరు23 (ఆంధ్రజ్యోతి): సింగరేణి కాలరీస్ కంపెనీ లిమిటెడ్ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్‌గా బాధ్యతలు నిర్వహిస్తున్న బలరాంనాయక్ విదేశీ పర్యటనలో ఉన్నందున వేరే వారికి తాత్కాలికంగా బాధ్యతలు అప్పగించాలని బహుజన సమాజ్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, అడ్వకేట్ యెర్రా కామేష్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం పార్టీ కార్యాలయంలో జరిగిన జిల్లా సమీక్ష సమవేశంలో ఆయన మాట్లాడారు. ఈ సమావేశంలో జిల్లా అధ్యక్షులు గంధం మల్లిఖార్జునరావు, జిల్లా ఉపాధ్యక్షులు కంపాటి నరేష్, జిల్లా ప్రధాన కార్యదర్శి మాలోత్ వీరునాయక్, జిల్లా కార్యదర్శి గద్దల రవి, జిల్లా కోశాధికారి పీక మల్లిఖార్జునరావు పాల్గొన్నారు.

టీడీపీ నాయకుడు చిలకారెడ్డి మృతి

సుజాతనగర్, సెప్టెంబరు 23: సుజాతనగర్ మండలం వేపలగడ్డ గ్రామానికి చెందిన తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకుడు కీసర మాలకొండారెడ్డి (చిలాకారెడ్డి) (74) అనారోగ్యంతో సోమవారం మృతి చెందారు. ఆయన మృతదేహాన్ని పలువురు నాయకులు సందర్శించారు. చిలకారెడ్డి మృతి బాధాకరం అని కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు, సీపీఎం రాష్ట్ర నాయకులు కాసాని అన్నారు. నివాళులర్పించిన వారిలో టీపీసీసీ సభ్యులు నాగా సీతారాములు, నాయకులు కోనేరు చిన్ని, దస్రు, వీర్ల రమేష్, తాళ్లూరి అప్పారావు, ఆరం రామయ్య, బత్తుల వీరయ్య లావుడ్యా సత్యన్నారాయణ, చింతలపూడి రాజశేఖర్, బచ్చల కూర శ్రీను, జయరాం రెడ్డి, తులసిరెడ్డి, వెంకటేశ్వరరెడ్డి, శ్రీనివాసరెడ్డి, గురజాల సీతయ్య, పుల్లయ్య తదితరులు ఉన్నారు.

ఉపాధ్యాయులకు సన్మానం

ఆళ్లపల్లి, సెప్టెంబరు23: మర్కోడు బాలుర ఆశ్రమ పాఠశాలలో పలువురు ఉపాధ్యాయులకు సోమవారం ఘనంగా సన్మానం చేశారు. మర్కోడు ఆశ్రమ పాఠశాల కాంప్లెక్స్ పరిధిలో గల 12 ఉపాధ్యాయులు జిల్లాలోని వివిధ పాఠశాలలకు బదిలీ కావడంతో సోమవారం వారికి సన్మానం చేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు బాబులాల్, కిషన్, నాగేశ్వరావు, ఎర్రయ్య, జోగరాంబాబు, రాంబాబు, జోగయ్య, నరేష్ రవిందర్, మోహన్, లక్ష్మి, సోమేశ్వరావు, బాలకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

వేతనాలు ఇప్పించాలని స్వచ్ఛ కార్మికుల వినతి

పాల్వంచ టౌన్, సెప్టెంబరు 23: తమకు వేతనాలు ఇప్పించాలని మునిసిపల్ స్వచ్ఛ ఆటో కార్మికులు అధికారులకు మొరపెట్టుకున్నారు. సోమవారం మునిసిపల్ కమిషనర్ డాకూనాయక్‌ను కలిసి వినతి పత్రం అందించారు. ఉన్నతాధికారుల దృష్టికి ఈ విషయాన్ని తీసుకెళ్లి సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ లక్ష్మణరావు, పర్యావరణ ఇంజనీర్ ఫరీద్, కార్మికులు పాల్గొన్నారు.

అనుమానితులుగా కనిపిస్తే సమాచారం అందించాలి

- కరకగూడెం ఎస్ఐ రాజేందర్

కరకగూడెం, సెప్టెంబరు23: మండలంలో ఎవరైనా కొత్త వ్యక్తులు అనుమానితులుగా కనిపిస్తే తక్షణమే పోలీసులకు సమాచారం అందించాలని కరకగూడెం ఎస్ఐ రాజేందర్ తెలిపారు. మావోయిస్టు వారోత్సవాల సందర్భంగా సోమవారం మండలంలోని సమత్ భట్టుపల్లి వద్ద ప్రధాన రహదారిపై ముమ్మరంగా తనిఖీలు చేపట్టారు. అనుమానితులుగా కనిపించిన వారి ఆధార్ కార్డు పూర్తి వివరాలు తీసుకున్నారు. ఈ కార్యక్రమంలో సివిల్ పోలీస్, స్పెషల్ పార్టీ సిబ్బంది పాల్గొన్నారు.


వాహనాలను తనిఖీ చేస్తున్న ఎస్ఐ రాజేందర్